## సాధారణ సర్వ సభ్య సమావేశపు నోటీసు

విజయవాడ నగరపాలక సంస్థ సాధారణ సర్వ సభ్య సమావేశము, ఎజెండాలో పొందుపరచిన అంశములను చర్చించుటకుగాను **ది.20-06-2008** శుక్రవారం ఉదయం గం.**10.30** ని॥లకు విజయవాడ నగరపాలక సంస్థ సభా హాలు నందు జరుగును. కావున సభ్యులందరు హాజరు కాగోరుచున్నాను.

నగరపాలక సంస్థ కార్యాలయము, విజయవాడ, తేది: **12-06-2008.**

సె క్ర ట రీ,
విజయవాడ నగరపాలక సంస్థ.

## ఎ జెం డా

**1/74-** ది.**04-04-2008** శుక్రవారం ఉదయం గం.**10.30** ని॥లకు , ది.**08-04-2008** మంగళవారము ఉదయం గం.**10.30** ని॥లకు మరియు ది.**09-04-2008** బుధవారం మధ్యాహ్నం గం.**2.00** లకు జరిగిన సాధారణ సర్వ సభ్య సమావేశపు తీర్మానములను ధృవపర్చుట గురించి.

**2/75-** విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ చట్టములోని **122**వ సెక్షన్ ననుసరించి వార్డు మెంబర్లచే వేయబడిన ప్రశ్నలు.

**3/76-** శ్రీమతి టి.డి.వి. నాగలక్ష్మి, **47**వ డివిజన్ కార్పోరేటర్ గారు తన ప్రతిపాదనలో సీతన్నపేట మంచినీటి రిజర్వాయరు ప్రక్కన గల దమ్మాలపాటి రామారావు కూరగాయల మార్కెట్టు పేరును, అక్కడ కూరగాయల మార్కెట్టు నడుపనందున ఇనుప సామానుల వ్యాపారము జరుగుచున్నందున ''దమ్మాలపాటి రామారావు మునిసిపల్ కాంప్లెక్సు'' గా మార్పు చేయవలసినదిగా ప్రతిపాదించియున్నారు.

ఇందుపై ట్రాఫిక్ మరియు స్పోర్ట్స్ ప్రత్యేక కమిటీ వారు తమ తీర్మానము నెం.**16/17**, ది.**25-6-07**లో ప్రతిపాదన ఆమోదించియున్నారు.

కావున **47**వ డివిజన్‌లోని సీతన్నపేట మంచినీటి రిజర్వాయరు ప్రక్కన గల దమ్మాలపాటి రామారావు కూరగాయల మార్కెట్టు పేరును ట్రాఫిక్ మరియు స్పోర్ట్సు ప్రత్యేక కమిటీ వారు తమ తీర్మానము నెం.**16/17**, ది.**25-06-07**లో ఆమోదించిన విధముగా ''దమ్మాలపాటి రామారావు మునిసిపల్ కాంప్లెక్సు'' గా మార్పు చేయుటకు కార్పోరేషన్ వారి నిర్ణయము కోరుచూ వుంచిన ఆఫీసు సూచనను చదవడమైనది. **(ఆర్.సి.జి7-36449/07).**

4/77- శ్రీ నూకల నాగేశ్వరరావు, 39వ డివిజను కార్పోరేటరు గారు ది.14-02-2008 గల లేఖలో కె.బి.యన్.కాంప్లెక్సు ప్రక్కన గల డ్వాక్వా బజారును వారి డివిజనులో ఉన్న డ్వాక్వా గ్రూపు వారికి షాపులుగా ఎలాట్‌మెంటు చేయవలసిందిగా కోరుతూ దానితో ఒక అర్జీని జతపర్చి పంపినారు.

కె.బి.యన్.కాంప్లెక్సు నందలి, రోడ్డు వైపునగల ఖాళీ స్థలము 6 X 6 = 36 అడుగులు స్థాయీ సంఘము వారి తీర్మానము నెం.1067, ది.11-04-2002 ననుసరించి శ్రీ కె.వి.రమణగారికి క్యాంటీన్ నడుపుకొనుటకు నెలకు రూ.400/-లు అద్దెపై కేటాయించుట జరిగినది. తదుపరి కార్పోరేషన్ వారు మొత్తము స్థలమును నెలసరి అద్దె రూ.24,285/-లు చొప్పున తీసుకొనవలసినదిగా కోరగా, సదరు శ్రీ కె.వి.రమణగారు ఆమోదము తెలుపనందున సదరు లీజును రద్దుచేయడమైనది. అందుపై సదరు శ్రీ కె.వి.రమణగారు హై కోర్టు నందు దావా నెం.19715/02 దాఖలు చేసినారు. సదరు దావాపై స్టే విచారణ కొనసాగుచున్నది.

శ్రీ నూకల నాగేశ్వరరావు, 39వ డివిజను కార్పోరేటరుగారు వారి ప్రతిపాదన ది.28-07-2007లో కె.బి.యన్.షాపింగ్ కాంప్లెక్సు ప్రక్కన గల రేకుల షెడ్డును 2005లోడ్వాక్వా గ్రూపు మహిళా బజారు నిమిత్తం ఏర్పాటు చేసినారని, కాని యిప్పటివరకు ఎవ్వరికినీ ఎలాట్ చేసియుండలేదని, కనుక సదరు డివిజనులో గల పేద డ్వాక్వా గ్రూపు వారికి షాపులు క్రింద ఎలాట్‌మెంటు చేయవలసినదిగా కోరుచున్న ప్రతిపాదనపై కౌన్సిల్ వారు వారి తీర్మానము నెం.204, తేది.06-08-2007లో ఆఫీసు రిమార్కులతో తదుపరి సమావేశము నందుంచవలసినదిగా తీర్మానించియున్నారు.

తదుపరి పై రెండవ పేరాలో పేర్కొనిన 36 అడుగులు స్థలమును మినహాయించి, మిగిలిన 1272.6 చదరపు అడుగుల స్థలము అందు గల షెడ్డును స్థాయీ సంఘము వారి తీర్మానము నెం.184, ది.14-09-2006 ననుసరించి, నెలకు రూ.8908/-లు అద్దె మరియు గుడ్‌విల్ రూ.50,000/-లుగా నిర్ణయించి, సంవత్సరము అద్దెను అడ్వాన్సుగా చెల్లించు షరతుపై శ్రీ పి.రవి కుమార్ గారికి కేటాయించుటకు తీర్మానించియున్నారు. సదరు శ్రీ పి.రవికుమార్ గారు గుడ్‌విల్ రూ.50,000/-లు మరియు ఒక సంవత్సరము అద్దె రూ.1,06,896/-లను డి.డి.లు 102691 మరియు 102692 ద్వారా చెల్లించినారు. సదరు మొత్తములు ది.17-03-2007న నగరపాలక సంస్థ నిధులకు జమ అయినవి. తదుపరి సదరు షెడ్డును ఫాస్ట్ ఫుడ్ రెస్టారెంట్ నడుపుటకుగాను శ్రీ పి.రవి కుమార్ గారికి మూడు సంవత్సరములకు ది.17/03/2007 నుండి ది.16/03/2010 వరకు కేటాయించుచూ ది.17-03-2007న ఉత్తర్వులు యిచ్చుట జరిగినది. శ్రీ పి.రవికుమార్, లీజుదారుడు డిసెంబరు, 2007 వరకు నెలసరి అద్దెలు పూర్తిగా చెల్లించియున్నారు. కానీ సదరు లీజుదారుడు ఫాస్టు ఫుడ్ సెంటర్‌ను ప్రారంభించియుండనందున, సదరు స్థలములో బిక్షగాళ్లు మరియు చెత్త కాగితములు ప్రోగు చేసుకొనువారు ఆక్రమించి ఉండుటవలన లీజుదారునకు వెంటనే సదరు స్థలమునకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయవలసినదిగా నోటీసును యివ్వగా వారు సదరు స్థలములో ఫాస్టు ఫుడ్ సెంటర్ ప్రారంభించుటకు కొన్ని మార్పులు చేసుకొనుటకు దరఖాస్తు చేయగా సదరు దరఖాస్తుపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు-1 గారి రిమార్కుల ననుసరించి, రూ.25,000/-లు నగరపాలక సంస్థకు చెల్లించి తదుపరి మార్పులు, చేర్పులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు-1 గారి పర్యవేక్షణలో చేసుకొనవలసినదిగా ఆదేశించడమైనది. లీజు దారుడైన శ్రీ పి.రవి కుమార్, చలానా నెం.07740, తేది.15-02-2008న రిస్టోరేషన్ చార్జీల క్రింద రూ.25,000/-లు చెల్లించినారు. సదరు చేర్పులు, మార్పుల పనిని కూడా ప్రారంభించినారు.

ఇట్టి పరిస్థితిలో శ్రీ నూకల నాగేశ్వరరావు, 39వ డివిజను కార్పోరేటరు గారు సదరు స్థలమును అందులో గల షెడ్డులు డ్వాక్వా గ్రూపు వారికి కేటాయించవలసినదిగా కోరినందునను, కాని పై ఆఫీసు రిమార్కుల దృష్ట్యా ప్రస్తుత లీజుదారుడు శ్రీ పి.రవి కుమార్ గారు స్థాయీ సంఘము వారి షరతులకు లోబడి సొమ్ము చెల్లించి పనిని ప్రారంభించినందున కార్పోరేటర్ గారి ప్రతిపాదనను పరిశీలన నిమిత్తము కౌన్సిల్ వారి ముందుంచిన ఆఫీసు సూచన చదవడమైనది.

(ఆర్.సి.ఎ2-31719/2005)

(కార్పోరేషన్ వారి తీర్మానము నెం.**11**, తేది: **04-04-2008** నందు వాయిదా వేయడమైనది)

**5/78** – విజయవాడ నగరపాలక సంస్థచే **99** స్కూళ్ళను నిర్వహించబడుచున్నవి. ఇందులో వివిధ కేడరులలో **253** టీచరుల పోస్టులు ఖాళీగా వున్నవి.

ఈ పోస్టులను డి.ఎస్సీ ద్వారా ప్రభుత్వము వారు భర్తీ చేయవలసియున్నది. కాని ప్రభుత్వము వారు ఇందుపై తగు చర్య చేపట్టనందునను, టీచరుల కొరత వలన పిల్లల బోధనకు భంగం వాటిల్లరాదని నిర్ణయించి, సదరు పోస్టులకుగాను జిల్లా / మండల పరిషత్ స్కూళ్ళలో పనిచేస్తున్న టీచర్లు పలు కారణముల వలన మన కార్పోరేషన్ స్కూళ్ళకు బదిలీ కోరుతూ మన ఆమోదము కోరియున్నారు.

ఈ విధముగా అందిన దరఖాస్తులను పరిశీలించి కౌన్సిల్ వారి ఆమోదముతో **171** దరఖాస్తులను ప్రభుత్వమునకు సిఫార్సు చేయడమైనది. మరొక **71** దరఖాస్తులను కౌన్సిల్ వారి ముందుంచడమైనది.

ప్రస్తుతం మిగిలిన టీచర్ పోస్టుల ఖాళీ వివరములు ఈ క్రింది విధముగా వున్నవి :

| | | |
|---|---|---|
| **1)** స్కూలు అసిస్టెంట్ (పి.ఎస్.) | .. | **2** |
| **2)** స్కూలు అసిస్టెంట్ ఉర్దూ ఎన్.ఎస్. | .. | **1** |
| **3)** తెలుగు పండిట్ గ్రేడ్-**2** | .. | **8** |
| **4)** డ్రాయింగ్ | .. | **1** |
| **5)** మ్యూజిక్ | .. | **2** |
| **6)** పి.ఇ.టి. | .. | **1** |
| **7)** క్రాఫ్ట్ | .. | **1** |
| మొత్తము : | | **16** |

ఈ మిగిలిన పోస్టులకుగాను ది.31-12-2007వ తేదీ నుండి ది.15-03-2008వ తేదీ వరకు అందిన దరఖాస్తులలో క్రింది పేర్కొనబడిన దరఖాస్తులకు ఖాళీలు వున్నవి.

| వ. నెం. | మిగిలిన ఖాళీల సంఖ్య | దరఖాస్తుదారుని వివరములు | క్యాడర్ / అర్హత | దరఖాస్తు అందిన తేది |
|---|---|---|---|---|
| 1. | పి.ఇ.టి.-1 | శ్రీమతి కె.నాగమణి, మున్సిపల్ గరల్స్ హైస్కూల్ రుస్తుంబడా (పార్కు), మచిలీపట్నం. | పి.ఇ.టి. చదువుల అర్హత వివరములు అందియుండలేదు. | 31-12-2007 |
| 2. | క్రాఫ్టు టీచర్-1 | శ్రీ కె.ప్రసాద రావు, ఎ.జి.కె.ఎం. హై స్కూల్, గుడివాడ మున్సిపాలిటీ. | క్రాఫ్టు చదువుల అర్హత వివరములు అందియుండలేదు. | 23-02-2008 |
| 3. | తెలుగు పండిట్-8 | 1. శ్రీమతి ఎన్.ప్రకాష్ రాణి, జిల్లా పరిషత్ హై స్కూలు ఆత్కూరు, ఉంగుటూరు మండల్, కృష్ణా. | టి.పి.-2 చదువుల అర్హత వివరములు అందియుండలేదు. | 10-03-2008 |
| | | 2. శ్రీమతి ఆర్.బాల త్రిపుర సుందరి, ఎం.పి.ఇ.ఎస్., రేపూడి తండా, ఎ.కొండూరు మండలము, కృష్ణా జిల్లా. | టి.పి.-2 1) బి.ఏ., 2) పండిట్ ట్రైనింగ్ | 18-02-2008 |

కావున, పైన పేర్కొనబడిన దరఖాస్తులను ప్రభుత్వమునకు సిఫార్సు చేయు విషయములో తగు నిర్ణయము చేయవలసినదిగా కౌన్సిల్ వారిని కోరుచున్న ఆఫీసు సూచనను చదవడమైనది. (ఆర్.సి.కె3-35968/2003).

6/79- విజయవాడ నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని మునిసిపల్ లిమిట్స్‌ను (ఎక్స్‌టెన్షన్) పెంచుటలో భాగంగా " నగర శివార్ల లోని 15 పంచాయితీల విలీనమునకు సూత్రప్రాయంగా ఆమోదించుచూ, ప్రస్తుతము పంచాయితీల కాల పరిమితి ముగిసిన పిదప పూర్తి స్థాయిలో విలీనము చేయుటకు తగు చర్యలు తీసుకొనవలసినదిగా రాష్ట్ర ప్రభుత్వమును కోరుచూ తీర్మానించిన" కౌన్సిల్ వారి తీర్మానము నెం. 288, తేది.28-12-2007 ను చదవడమైనది.

అందుపై ఆఫీసు వారి లేఖ ఆర్‌సి.జి2-38576/81, తేది.21-1-2008 నందు సదరు కౌన్సిల్ వారి తీర్మానము నకలును ప్రభుత్వము వారికి తదుపరి చర్యలు కోరుచూ పంపడమైనదనియు

అందుపై ప్రభుత్వము వారు తమ మెమో నెం. 2716/K2/2008-1, తేది: 13-2-2008 నందు జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీసామినేని ఉదయభాను గారు అసెంబ్లీ నందు అడిగిన LAQ నెం.9311 కాపీకి జత చేయుచూ ఈ క్రింది విషయములలో తగు సమాచారమును అసెంబ్లీలో జవాబు ఇచ్చు నిమిత్తం వెంటనే పంపవలసినదిగా కోరియున్నారు.

(1) విజయవాడ నగర అభివృద్ధికి ఆటంకముగా యున్న ట్రాఫిక్ సమస్యను అధికమించుటకుగాను నగరమునకు అవుటర్ రింగ్ రోడ్డు నిర్మించు ప్రతిపాదన ఏదైనా ప్రభత్వము వారి వద్ద ఉన్నదా?

(2) షుమారు ఎంత కాలమునకు విజయవాడ నగరము గ్రేటర్ విజయవాడగా మార్పు చెందును?

(3) అవుటర్ రింగ్ రోడ్డు పూర్తి అగుటకు ఎంత కాలము పట్టును?, ఎంత ఎస్టిమేషన్ (ఖర్చు) అగును?

అందు పై సదరు 1 మరియు 3 ప్రశ్నలు విజి.టి.ఎమ్. ఉడా వారికి సంబంధించిన విషయములనియు,

మరియు 2 వ ప్రశ్నకు అనగా గ్రేటర్ విజయవాడకు సంబంధించి కౌన్సిల్ వారు తమ తీర్మానము నెం.288, తేది. 28-12-2006 నందు "నగర శివార్లలోని ఈక్రింది తెలియచేసిన 15 పంచాయితీల విలీనమునకు సూత్రప్రాయంగా ఆమోదించుచూ, ప్రస్తుతము పంచాయితీల కాల పరిమితి ముగిసిన పిదప పూర్తి స్థాయిలో విలీనము చేయుటకు తగు చర్యలు తీసుకొనవలసినదిగా రాష్ట్ర ప్రభుత్వమును కోరుచూ తీర్మానించడమైనదని" విషయమును, అందుపై సదరు కౌన్సిల్ వారి తీర్మానము నకలును ప్రభుత్వము వారికి తదుపరి చర్యల కొరకై పంపిన విషయమును, ఆఫీసు వారి లేఖ ఆర్.సి.జి2-13856/81, తేది.14-2-2008 లో, ప్రభుత్వము వారికి LAQ నకు జవాబు నిమిత్తమై తెలియజేయడమైనది.

| వ. నెం. | గ్రామ పంచాయతీ / గ్రామము పేరు | మండలం పేరు | విస్తీర్ణము Sq.KM | 2001 సెన్సెస్ ప్రకారము జనాభా |
|---|---|---|---|---|
| 1 | కానూరు | పెనమలూరు | 8.98 | 30696 |
| 2 | యనమలకుదురు | పెనమలూరు | 2.85 | 25463 |
| 3 | తాడిగడప | పెనమలూరు | 5.80 | 12796 |
| 4 | పోరంకి | పెనమలూరు | 11.83 | 20166 |
| 5 | నిడమానూరు | విజయవాడ రూరల్ | 7.25 | 6449 |
| 6 | దొన్నేటికూరు | విజయవాడ రూరల్ | 6.13 | De-populated village |
| 7 | ఎనికేపాడు | విజయవాడ రూరల్ | 4.87 | 4909 |
| 8 | ప్రసాదంపాడు | విజయవాడ రూరల్ | 2.35 | 6696 |
| 9 | రామవరప్పాడు | విజయవాడ రూరల్ | 3.31 | 10224 |
| 10 | నున్న | విజయవాడ రూరల్ | 21.1 | 12393 |
| 11 | పాతపాడు | విజయవాడ రూరల్ | 13.46 | 2993 |
| 12 | ఫిర్యాది నైనవరం | విజయవాడ రూరల్ | 5.33 | 2475 |
| 13 | అంబాపురం | విజయవాడ రూరల్ | 3.57 | 1688 |
| 14 | జక్కంపూడి | విజయవాడ రూరల్ | 8.05 | 1706 |
| 15 | గొల్లపూడి | విజయవాడ రూరల్ | 22.61 | 17841 |
| Total: | | | 127.49 | 1,56,495 |

ప్రభుత్వము వారి నుండి LAQ విషయములో వచ్చిన మెమో నెం. 2716/K2/2008-1, తేది. 13-2-2008 ని కౌన్సిల్ వారి ముందు రికార్డు కొరకై ఉంచగా, కౌన్సిల్ వారు తమ తీర్మానము నెం. 71, తేది.9-4-2008 నందు సదరు అంశమును తదుపరి సర్వ సభ్య సమావేశము నందు ఉంచవలసినదిగా తీర్మానించియున్నారు.

కావున సదరు విషయములన్నియు కౌన్సిల్ వారి ముందు సమాచారము నిమిత్తము ఉంచుచూ వ్రాసిన ఆఫీసు నోటు చదవడమైనది. (Rc.G2-13856/81)

**7/80-** గౌరవ సుప్రీం కోర్టు వారి ఆదేశాలను అనుసరించి, విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో బహిరంగముగా చెత్తను తరలించుట ఆపి వేయవలసి వున్నది. అందుకనుగుణముగా మునిసిపల్ కార్పోరేషన్ ఆరోగ్య శాఖ వారిచే నగరపాలక సంస్థలోని గుర్తించిన ప్రదేశాలలో మూసి వుంచిన యినుప కుండీలు (డంపర్ బిన్నులు) మొత్తము **424** అవసరమని అంచనా వేయబడినది. ప్రస్తుతము **320** డంపర్ బిన్నులకుగాను **15** డిపార్ట్‌మెంట్ వాహనములు మరియు **7** కాంట్రాక్టు వాహనములు మాత్రమే వున్నవి. మిగిలిన **104** డంపర్ బిన్నులకుగాను నగర పరిధిలో చెత్తను తరలించుటకు **10** డంపర్ ప్లేసర్స్ వాహనములు కొనుగోలు చేయవలసిన ఆవశ్యకత కలదు. ఈ విధముగా చేయుట వలన విజయవాడ నగరపాలక సంస్థ ఆర్.సి.సి. డంపర్ బిన్నులు లేని నగరముగా గుర్తించబడును. కావున సదరు **10** డంపర్ ప్లేసర్స్‌ను కొనుగోలు చేయుటకుగాను ఖర్చు రూ.**132** లక్షలను **12**వ ఫైనాన్స్ కమీషన్ నిధుల నుండి కొనుగోలు చేయుటకు కౌన్సిల్ వారి నిర్ణయము కోరుచున్న ఆఫీసు సూచనను చదవడమైనది.
(ఆర్.సి.వి1-124846/2008).

**8/81-** శ్రీమతి అఫ్రీన్ సుల్తాన్, **20**వ డివిజన్ కార్పోరేటర్ గారు తమ డివిజను పరిధిలో రైవస్ కాలువపై కొత్తగా నిర్మించిన వంతెన ఉత్తర భాగము నందు (లేటు) శ్రీ వంగవీటి మోహన రంగా రావు విగ్రహము ఉండేదని దానిని వంతెన నిర్మాణ సమయములో తొలగించినందున విగ్రహము పునః ప్రతిష్ఠించుటకు అనుమతి కోరియున్నారు.

ఇందుపై తెలియజేయునది కూర్మయ్య వంతెన వద్ద కొత్త వంతెన నిర్మాణ సమయములో అక్కడ వున్న శ్రీ వంగవీటి మోహనరంగా గారి విగ్రహము తొలగించబడినది. సదరు ఏరియాలో శ్రీ వంగవీటి మోహనరంగా గారి విగ్రహము తిరిగి ఏర్పాటు చేయుటపై రిమార్కులు కొరకు కమీషనర్ ఆఫ్ పోలీస్, విజయవాడ సిటీ వారికి వ్రాయగా, కమీనషర్ ఆఫ్ పోలీస్, విజయవాడ సిటీ వారు నెం.**201/**ఎం**3/**పి**/08,** ది.**10-01-08** గల ఎండార్సుమెంట్ నందు అన్నదాన సమాజం రోడ్డులో రైవస్ కాలువపై వున్న కూర్మయ్య వంతెన మరియు కొత్త వంతెన మధ్యన వున్న ఐలాండ్‌లో శ్రీ వంగవీటి మోహన రంగా రావు గారి కంచు విగ్రహము ఏర్పాటు చేయుటకు అభ్యంతరము లేదని తెలిపియున్నారు.

సదరు రెండు వంతెనల వద్ద (లేటు) శ్రీ వంగవీటి మోహన రంగా రావు గారి విగ్రహము ఏర్పాటుపై అనుమతి కొరకు సూపరింటెండింగ్ ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్ వారికి వ్రాయగా, వారు నెం. SE/IC/Vja./CB/ NJPA/MC, 518M, ది.**9-05-08** గల లేఖలో రైవస్ కాలువ కూర్మయ్య వంతెన వద్ద శ్రీ వంగవీటి మోహన రంగా రావు గారి విగ్రహము ఏర్పాటుకు అభ్యంతరము లేదని, అయితే రైవస్ కాలువ ఆధునీకరణకు మరియు కాలువ నీటి ప్రవాహమునకు ఆటంకములేని విధముగా కాలువకు **10** మీటర్లు మార్జిన్ వదలి ఏర్పాటు చేయ వలసినదిగా తెలిపియున్నారు.

కావున, అన్నదాన సమాజము రోడ్డు, కూర్మయ్య వంతెన మరియు క్రొత్తగా నిర్మించిన వంతెన మద్యన వున్న ఐలాండ్‌లో (లేటు) శ్రీ వంగవీటి మోహన రంగా రావు గారి విగ్రహము ఏర్పాటు చేయుటకు అనుమతించుటకు కార్పోరేషన్ వారి నిర్ణయము కోరుచూ వుంచిన ఆఫీసు నోటు చదవడమైనది.
**(ఆర్.సి.జి7-54508/06).**

**9/82-** శ్రీ పొట్లూరి శివసాయి ప్రసాద్, **10**వ డివిజన్ కార్పోరేటర్ గారు వారి అర్జీల నందు తాను అమెరికాలో వున్న వారి యొక్క పిల్లల వద్దకు వెళ్ళుటకుగాను ది.**07-06-08** నుండి ఆరు నెలల కాలముపాటు అమెరికాలో వుండుటకు నిర్ణయించుకొని, సదరు కాలమును సెలవుగా పరిగణించవలసినదిగా కోరియున్నారు.

విజయవాడ నగరపాలక సంస్థకు అనువర్తించబడిన **1955** హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ చట్టములోని సెక్షన్-**23** (డి) ప్రకారము ఎవరైనా సభ్యులు **6** నెలల కాల పరిమితికి మించకుండా కార్పోరేషన్ వారిచే సెలవుకు అనుమతి పొందిన సందర్భములో మినహా, సభ్యులు వరుసగా మూడు కార్పోరేషన్ సమావేశములకు హాజరు కాని సందర్భములో (లేక) **6** నెలలకుపైగా కార్పోరేషన్ సమావేశములకు హాజరు కాని సందర్భములో సభ్యత్వాన్ని కోల్పోతారు.

అందుపై శ్రీ పొట్లూరి శివసాయి ప్రసాద్, **10**వ డివిజన్ కార్పోరేటర్ వారి యొక్క ఆరు నెలల కాలమును సెలవుగా మంజూరు చేయు విషయములో కార్పోరేషన్ వారిని కోరుచున్న ఆఫీసు సూచన చదవడమైనది.
**(ఆర్.సి.యం.1-124700/08).**

10/83- శ్రీ చిగురుపాటి బాబూరావు గారు, సిపి.ఐ (ఎం) ఫ్లోర్ లీడర్, విజయవాడ నగరపాలక సంస్థ వారు నగరములోని పాత ఆర్.టి.సి. బస్టాండు స్థలాన్ని ప్రయివేట్ సంస్థలకు లీజుకు యివ్వకుండా ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఏపి.ఎస్.ఆర్.టి.సి. సంస్థ వారిని కోరుచూ మరియు సదరు స్థలములో ఎటువంటి క్రొత్త నిర్మాణాలకు అనుమతి యివ్వరాదని కోరుచూ ప్రతిపాదించిన మేరకు కౌన్సిల్ వారు తమ తీర్మానము నెం. 244, ది. 27-10-2007 నందు ఆఫీసు వారి రిమార్కులు కోరుచూ తీర్మానించినారు.

విజయవాడ నగరములోని ఏలూరు రోడ్డు నందు ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. వారికి చెందిన పాత బస్టాండు స్థలములోని కొంత భాగము అనగా 2836 గజములు సర్వే రికార్డుల ప్రకారము రెవెన్యూ వార్డు నెం. 8, బ్లాక్ నెం. 34, ఎన్.టి.ఎస్. నెం. 1013/సి అయి రెవెన్యూ ఖాళీ స్థలము అయి మరియు కొంత భాగము రెవెన్యూ వార్డు నెం. 9, బ్లాక్ నెం.1, ఎన్టి.ఎస్. నెం.11/2 ప్రభుత్వ భూమి అయి, Cattle Bund స్థలము అయి మరియు కొంత భాగము రెవెన్యూ వార్డు నెం. 10,

బ్లాక్ నెం.1, ఎన్.టి.ఎస్. నెం. 11/2 అయి రైవస్ కెనాల్ స్థలములుగా నమోదై యున్నవి. మరియు గతములో ఇవి ఆర్.టి.సి. వారికి చెందిన బస్టాండు స్థలము అయి వున్నది. సదరు బస్టాండు స్థలము నుండి పై తెలిపిన టౌన్ సర్వే నెంబర్లు ధాఖలా 2836 Sq.m. భాగమును ఏ.పి.యస్.ఆర్.టి.సి. వారు బిడ్ పద్ధతి ద్వారా మెస్సర్స్. అంబికా ఎంఫైర్ అను సంస్థకు "లైసెన్స్ అగ్రిమెంట్ " Agreement No.1/CCE/COM/AGT/07-08, Dt. 30.5.07 ద్వారా సదరు స్థలము నందు ఒక కమర్షియల్ ప్రాజెక్టు ను BOT (Build-Operate-Transformer) బేసిస్ పై కొన్ని షరతులకు లోబడి 30 సం.ములకు లీజు కాలమునకు (అనగా ది. 31-12-2006 నుండి ది. 30-12-2036 వరకూ) అభివృద్ధి పరచుటకు అప్పగించియున్నారు.

అందుపై మెస్సర్స్. అంబికా ఎంఫైర్ వారు సదరు స్థలము నందు పార్కింగ్ కొరకు రెండు బేస్‌మెంట్ ఫ్లోర్లు, గ్రౌండు ఫ్లోర్, మెజనైన్ ఫ్లోర్, మొదటి, రెండవ, మూడవ మరియు నాలుగవ అంతస్తులతో వాణిజ్య భవనమును నిర్మించుటకు అనుమతి కొరకు విజయవాడ నగరపాలక సంస్థకు బిల్డింగ్ అప్లికేషన్ ధాఖలు చేయగా కౌన్సిల్ వారికి తెలియజేయవలసియున్న దృష్ట్యా జాప్యమును నివారించుటకుగాను లేఖ నెం. బి.ఎ. 3102/07, ది. 28-12-07 ద్వారా త్రిప్పి పంపడమైనది.

తదుపరి అంబికా ఎంఫైర్ వారు ది. 15.5.2008గల తమ లేఖ యందు తాము ఏ.పి.యస్.ఆర్.టి.సి., హైదరాబాద్ వారి తరపున ఛీఫ్ సివిల్ ఇంజనీరు గారు మరియు మెస్సర్స్. అంబికా ఎంఫైర్ వారు పై తెలిపిన సదరు పాత బస్టాండు స్థలములోని 2836 చమీ.ల స్థలమును B.O.T.పద్ధతిలో 30 సం.ముల కాలమునకు తమకు లీజుకు యిచ్చియున్నారనియూ, తదుపరి తాము సదరు స్థలము నందు 2 బేస్‌మెంట్ ఫ్లోర్లు పార్కింగ్ కొరకు + గ్రౌండ్ ఫ్లోర్ + మెజనైన్ ఫ్లోర్ + 4 ఫ్లోర్లు వాణిజ్య భవన నిర్మాణ అనుమతి కొరకు విజయవాడ నగరపాలక సంస్థ వారికి బిల్డింగ్ అప్లికేషన్ ధాఖలు చేయగా వారు చిన్న కారణముతో త్రిప్పి పంపినారనియూ తెలిపియున్నారు. మరియు మాస్టర్ ప్లాన్ జోనింగ్ నిబంధనల ప్రకారము " ట్రాన్స్‌పోర్ట్ మరియు కమ్యూనికేషన్ జోన్" ఉపయోగములో యున్నట్లు తెలియుచున్నందున సదరు స్థలము యొక్క ఉపయోగమును " ట్రాన్స్‌పోర్ట్ మరియు కమ్యూనికేషన్ జోన్" ఉపయోగము నుండి " కమర్షియల్" ఉపయోగమునకు మార్పుచేయవలసినదిగా కోరియున్నారు. మరియు విజయవాడ నగరపాలక సంస్థ వారికి మరియు వి.జి.టి.యం.ఉడా వారికి చెల్లించవలసిన ఫీజులు చెల్లించెదమనియూ మరియు ఫైర్ డిపార్ట్‌మెంట్, ఎయిర్ పోర్ట్ అథారిటీ వారి నుండి నో-అబ్జక్షన్ సర్టిఫికెట్ ధాఖలు చేయగలమని తెలిపియున్నారు. తదుపరి తాము చేపట్టబోయే నిర్మాణము ప్రభుత్వముచే అనుమతి పొందిన సంస్థకు చెందినదై యున్నందున అవసరమైన అనుమతులు త్వరగా ఏర్పాటు చేయవలసినదిగా కోరియున్నారు.

పై తెలిపిన స్థలము విజయవాడ నగరమునకు మంజూరు చేయబడిన జోనల్ డెవలప్‌మెంట్ ప్లాను ప్రకారము " ట్రాన్స్‌పోర్ట్ మరియు కమ్యూనికేషన్ జోన్" నందు యున్నది. సదరు స్థలము నందు ప్రస్తుతము ఎటువంటి కట్టడములు లేవు. సదరు స్థలమునకు దక్షిణము వైపు గల ఏలూరు రోడ్డు యొక్క విస్తరణకు (100 అడుగుల వెడల్పునకు) అవసరమైన స్థలమును ఏ.పి.యస్.ఆర్.టి.సి. వారు వదిలివేసియున్నారు. సదరు చర్చనీయ స్థలము ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. వారిదై యుండి, మెస్సర్స్. అంబికా ఎంఫైర్ సంస్థకు 30 సం॥ములకు లీజుపై BOT పద్ధతిలో వాణిజ్య భవనమును నిర్మించుటకు అనుమతించినందున మరియు సదరు లీజుదారు అయిన మెస్సర్స్. అంబికా ఎంఫైర్ సంస్థ విజయవాడ నగరపాలక సంస్థ వారికి స్థల ఉపయోగపు మార్పు చేయుటకు ధరఖాస్తు చేసియున్నారు. కనుక మెస్సర్స్. అంబికా ఎంపైర్స్ సంస్థ వారి స్థల ఉపయోగపు మార్పు ధరఖాస్తుపై తదుపరి చర్యలు కొరకు విజి.టి.యం. ఉడా వారి ద్వారా ప్రభుత్వము వారికి పంపుటకు కౌన్సిల్ వారి అనుమతి కోరుచూ వ్రాసిన ఆఫీసు సూచనను చదవడమైనది. (ఆర్.సి.జి2-122575/08).

**11/84**- శ్రీ అడాపా శేషగిరి, **22**వ డివిజన్ కార్పోరేటర్ గారు తన ప్రతిపాదనలో స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహమును కనకదుర్గమ్మ వారధి దగ్గర గల సర్కిల్‌లో వంగవీటి మోహన రంగ ఛారిటబుల్ ట్రస్టు వారి స్వంత ఖర్చుతో ఏర్పాటు చేయుటకు ప్రతిపాదించియున్నారు.

ఇందుపై కార్పోరేషన్ వారు తమ తీర్మానము నెం.**297**, ది.**28-12-07**లో ఆఫీసు వారి రిమార్కులు కోరుచూ తీర్మానించియున్నారు.

ఇందుపై తెలియజేయునది కనకదుర్గమ్మ వారధి వద్ద గల ఐలాండ్‌ను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారిచే అభివృద్ధి చేయబడినది. లేటు వంగవీటి మోహన రంగా విగ్రహము సదరు ఐలాండ్‌లో ఏర్పాటు చేయుటకు నేషనల్ హైవే వారి నిరభ్యంతర పత్రము కావలసియున్నది. మరియు ప్రభుత్వము వారి ఉత్తర్వులు జి.ఓ.యం.యస్. నెం.**51** ప్రకారము జిల్లా కలెక్టర్ అధ్యక్షతన గల విగ్రహ కమిటీ ఆమోదము పొందవలసియున్నది. కావున పైన తెలిపిన విధముగా నేషనల్ హైవే డిపార్ట్‌మెంట్ మరియు జి.ఓ.యం.యస్. నెం.**51** ప్రకారము ఏర్పాటు చేసిన కమిటీ ఆమోదము లేకుండా శ్రీ (లేటు)వంగవీటి మోహన రంగా విగ్రహము కనకదుర్గమ్మ వారధి వద్ద ఏర్పాటు చేయుటకు వీలుపడదని తెలుపుచూ వ్రాయబడిన ఆఫీసు నోటు చదవడమైనది. (ఆర్.సి.జి7-**1489/08**).

12/85- 50వ డివిజను కార్పోరేటరు గారు అయిన శ్రీ ఏవి.కిరణ్ కుమార్ గారు ది.22-11-2007తో ప్రతిపాదించిన ప్రతిపాదన 50వ డివిజను పరిసర ప్రాంతములోని మహిళలు ఉదయము గం.4.00ల నుండి గం.6.00ల వరకు యోగా మరియు ధ్యానము తరగతులు నిర్వహించుకొనుటకు స్థానికముగా గల వి.ఎల్.దత్తు ప్రాథమిక పాఠశాల, కేదారేశ్వరపేట నందు గల సర్వశిక్షా అభియాన్ గదిని ఉపయోగించుకొనుటకు కనీస రుసుముతో కోరగా కౌన్సిల్ వారు వారి తీర్మానము నందలి నెం.300, తేది.28-12-2007లో ఆఫీసు వారి రిమార్కులు కోరియున్నారు. అందుపై అధికారులు పరిశీలన జరిపి ఈ క్రింది షరతులకు లోబడి కనీస రుసుముతో ఇవ్వవచ్చునని వారి రిమార్కులలో తెలిపియున్నారు.

1. యోగా క్లాసులు మాత్రమే నిర్వహించవలయును. మరియే విధమైన ప్రోగ్రాములు నిర్వహించరాదు.
2. పాఠశాల యందు జరుగు రెగ్యులరు క్లాసులకు అంతరాయము కల్గించరాదు.
3. అనుమతి యిచ్చిన సమయములో ఏవిధమైన మార్పు ఉండకూడదు.
4. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్ణయించిన ప్రకారము ప్రోగ్రామరు విద్యుత్ ఛార్జీలు చెల్లించవలయును.
5. పాఠశాల ఫర్నిచరును పాడుచేయరాదు. ఏమైనా పాడు చేసిన యెడల ఫర్నిచరు విలువనుబట్టి హెచ్.ఎమ్.గారు నిర్ణయించిన విలువను ప్రోగ్రామరు చెల్లింపవలయను.
6. యోగా క్లాసులు నిర్వహించుకొనుటకు యిచ్చిన అనుమతిని ఏ విధమైన నోటీసు లేకుండా విత్‌డ్రా చేయుటకు లేదా రద్దు పరచుటకు కమీషనరు గారికి అధికారము కలదు.
7. యోగా క్లాసులు నిర్వహించుకొను సమయము నందు ఏమైన ప్రమాదములు సంభవించిన ఎడల అట్టి ప్రమాదములు మరియు ఎటువంటి ఏవిధమైన ఆటంకములు ఏర్పడినను నగరపాలక సంస్థకు ఏవిధమైన బాధ్యత లేదు.
8. యోగా క్లాసులు అయిన వెంటనే ప్రతిరోజూ సదరు రూము తాళమును ప్రధానోపాధ్యాయులకు అప్పగించవలయును.
9. పబ్లిసిటీ నిమిత్తము ఏవిధమైన బోర్డులు పాఠశాల యందు పెట్టరాదు.
10. కనీస రుసుము నెలకు రూ.1,000/-లు చొప్పున నిర్ణయించడమైనది.
11. ఉదయం గం.4.00ల నుండి గం.6.00ల వరకు మాత్రమే సదరు గదిని యోగా క్లాసులకు ఉపయోగించుకొనవలెను.

పైన ఉదహరించిన షరతులతో వి.ఎల్.దత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో సర్వ శిక్షా అభియాన్ గదిని యోగా క్లాసులు నిర్వహించుకొనుటకు వారికి ఉపయోగించుకొనుటకు యిచ్చు

విషయములో కౌన్సిల్ వారి అనుమతి కోరుచున్న ఆఫీసు వారి సూచనను చదవడమైనది. (Rc.K1-56366/2007)

13/86- ప్రభుత్వము జారీ చేసిన జి.ఓ.(పి) నెం.100, ది.09-04-2008లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మరియు మున్సిపల్ కార్పోరేషను ఉద్యోగులకు కరువుభత్యము 30.144% నుండి 35.796% వరకు పెంచుతూ ది.01-01-2008 నుండి ది.31-03-2008 వరకు ప్రావిడెంటు ఫండు ఖాతాలో జమ చేయుటకు మరియు ది.01-04-2008 నుండి జీతముతోపాటు చెల్లించుటకు జారీ చేసిన జి.ఓ.,ను కౌన్సిలు వారి ఆమోదమునకు లోబడి (in-anticipation approval) అమలు చేయడమైనది.

కావున సదరు జి.ఓ.(పి) నెం.100, ది.09-04-2008 జి.ఓ. ను రికార్డుచేయు నిమిత్తము మరియు ఆఫీసు వారి చర్యను ర్యాటిఫై చేయుటకుగాను కౌన్సిల్ వారి ముందుంచిన ఆఫీసు సూచన చదవడమైనది. (Rc.C1-11643/2005)

14/87- గవర్నమెంటు వారి ఉత్తర్వులు జి.ఓ.(పి) నెం.107, ది.11-04-2008 నందు సూచించినట్లు డియర్‌నెస్ రిలీఫ్ 30.144% నుండి 35.796% వరకు పెంచుతూ, అరియర్సు ది.01-01-2008 నుండి ది.30-04-2008 వరకు ఏప్రియల్ నెల పింఛనుతోపాటు మే నేలలో చెల్లించవలసినదిగా సూచించడమైనది.

కావున గవర్నమెంటు వారి ఉత్తర్వులు జి.ఓ. (పి) నెం.107, ది.11-04-2008 నందు సూచించినట్లు డియర్‌నెస్ రిలీఫ్ విజయవాడ నగరపాలక సంస్థలోని సర్వీసు పింఛనుదార్లకు వర్తింపు చేయుటకుగాను అనుమతి కొరకు మరియు రికార్డు నిమిత్తము కౌన్సిలు వారి ముందు ఉంచిన ఆఫీసు సూచన చదవడమైనది. (ఆర్.సి.సి11-16603/2006)

<u>శ్రీకాశీనాథ్ దోనేపూడి, 23వ వార్డు మెంబరు గారి ప్రతిపాదనలు-</u>

**15/88-** విజయవాడ నగరములో విద్యుత్తు ఖర్చు నివారించుటకు విద్యుత్ ఆదాకు సంబంధించి నగరపాలక సంస్థ ద్వారా గతంలో హక్కులు పొందిన మెస్సర్స్ రియల్ ఎనర్జీ అను సంస్థ చేపట్టిన పని విధానమును సమీక్షించి దానిపై తగు చర్యలు చేపట్టవలసినదిగా కోరుతూ ప్రతిపాదించడమైనది.

**16/89-** రేషన్ కార్డులను అర్హత కలిగిన వారికి, గతంలో రశీదులుండి కార్డులు పొందనివారికి, అర్హత వుండి తెల్లకార్డు పొందలేని వారికి తిరిగి కార్డులు జారీ చేసేందుకు తక్షణం డిపి.ఎల్. కేంద్రం ప్రారంభించేందుకు తగు చర్యలు చేపట్టాల్సిందిగా ప్రతిపాదించడమైనది.

17/90- నగరపాలక సంస్థలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేటాయించిన స్థలాల రిజిస్ట్రేషన్‌ను త్వరితంగా పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకొనేలా కోరుతూ ప్రతిపాదించడమైనది.

18/91- నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజి మెయింటెనెన్స్ నిమిత్తం డీసిల్టింగ్ మెషిన్‌లను అదనంగా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవలసినదిగా ప్రతిపాదించడమైనది.

19/92-నగరంలో ఇళ్ళులేని వారికోసం నిర్మించ తలపెట్టిన ఇళ్ళను (హౌసింగ్ స్కీమ్) త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగాను, తగు రీతిలో నాణ్యాతా ప్రమాణాలు పాటించేటట్లుగాను చర్యలు చేపట్టాల్సిందిగా కోరుతూ ప్రతిపాదించడమైనది.

20/93-నగరములో పారిశుధ్య నిర్వహణ నిమిత్తం కొత్త వాహనాలను కొనుగోలు చేసేందుకు మరియు పుష్ కార్ట్స్ (తోపుడు బండ్లు), రిక్షాలు తదితరాల్ని ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు చేపట్టాల్సిందిగా ప్రతిపాదించడమైనది.

21/94- రాబోవు విద్యా సంవత్సరంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న హైస్కూల్, యు.పి.స్కూల్స్, ఎలిమెంటరీ స్కూల్స్ నందు విద్యార్థినీ విద్యార్థులు సౌకర్యార్థం బెంచీలు, డెస్కులు ఏర్పాటు చేసేందుకు, మంచినీరు, మరుగు దొడ్లు, ప్లే గ్రౌండ్ సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవలసిందిగా ప్రతిపాదించడమైనది.

శ్రీ పి.గౌతమ్ రెడ్డి, 44వ వార్డు మెంబరు గారి ప్రతిపాదన-

22/95- నిత్య జీవితావసర వస్తువులయిన అపరాలు, కూరగాయలు, వంట నూనెల ధరలు ఆకాశాన్ని అంటుచున్నాయి. కావున రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన ధరలను నియంత్రించవలసినదిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుచూ తీర్మానించడమైనది.

శ్రీ గోగుల రమణారావు, 54వ వార్డు మెంబరు గారి ప్రతిపాదన-

23/96- ఆయోధ్య నగర్ రాఘవేంద్ర థియేటర్ దగ్గర నాయీ బ్రాహ్మణ వృత్తిదారుల సంఘం వారికి కమ్యూనిటీ హాలు కార్పోరేషన్ వారి స్థలంలో నిర్మించటమైనది. ఈ నిర్మాణమునకు గౌరవ పార్లమెంటు సభ్యులు శ్రీ లగడపాటి రాజగోపాల్ గారి నిధుల నుండి 5 లక్షలు ఇవ్వటం జరిగింది. ఈ హాలుకు ఎటువంటి కంట్రిబ్యూషన్ కట్టనటువంటి ఏండూరి సంగయ్య గారి పేరు పెట్టడం నిబంధనలకు విరుద్ధం. కనుక ఆ పేరును తొలగించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీ కాశీనాథ్ దోనేపూడి, 23వ వార్డు మెంబరు గారి ప్రతిపాదనలు-

24/97- ప్రస్తుత కౌన్సిల్ ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు వివిధ అంశాలపై ఏర్పాటు చేయబడిన (విచారణ నిమిత్తం) మరియు (పరిశీలన నిమిత్తం) అడ్‌హాక్ కమిటీల రిపోర్టులను కౌన్సిల్ ముందుంచేందుకు చర్యలు తీసుకోవలసిందిగా ప్రతిపాదించడమైనది.

25/98- నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న స్విమ్మింగ్ పూల్స్, జిమ్‌ల మెయిన్‌టెనెన్స్ మరియు అందుకవసరమైన సామాగ్రి సక్రమంగా ఉండేట్లుగా చర్యలు తీసుకోవలసిందిగా ప్రతిపాదించడమైనది.

26/99- గతంలో నగరంలోని అన్ని డివిజన్‌లలో బిసి.వర్గాలకు చెందిన వారికి వ్యక్తిగతంగా గానీ, సంఘాలుగా (గ్రూపులు) గానీ రుణం మంజూరు చేస్తామని దరఖాస్తులు స్వీకరించి సంవత్సరం గడుస్తున్నా ఏవిధమైన చర్యలు లేవు. కావున దరఖాస్తుదారులలో అర్హులైన వారికి రుణం మంజూరు చేసేందుకు తగు చర్యలు తీసుకోవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీ బోయి సత్యబాబు, 37వ వార్డు మెంబరు గారి ప్రతిపాదనలు-

27/100- 37వ డివిజన్ నందు మహంతీపురం, అబ్దుల్ ఖాదర్ వీధిలో వున్న అవుట్‌ఫాల్ డ్రైన్ పాడైపోయినది. కావున సి.సి. డ్రైన్‌గా మార్పు చేయవలసినదిగా ప్రతిపాదించడమైనది.

28/101- 37వ డివిజన్ గొల్లపాలెంగట్టు రోడ్డు కొండ ప్రాంతము వైపు వున్న మురికి కాలువ పూర్తిగా పాడైపోయినది. మురుగు నీరు పోవుటకు యిబ్బందిగావున్నది. కావున సిసి. డ్రైన్‌గా మార్పు చేయ్యాలని ప్రతిపాదించుచున్నాను.

29/102- 37వ డివిజన్ నందు వున్న సర్దార్ మరుపిళ్ళ చిట్టి యుపి.స్కూల్ (ఇంగ్లీషు మీడియా) విద్యార్థులకు సరిపోవటం లేనందున ప్రక్కన ఖాళీగా వున్న పడమర భాగంలో మరొక 5 గదులు నిర్మాణం చేపట్టాలని కోరుతూ ప్రతిపాదించడమైనది.

30/103- మహాప్రస్థానం వాహనం నగరములో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఒక వాహనం మాత్రమే వున్నది. ఉన్న ఒక వాహనం నిత్యం రిపేర్లు అగుచు ప్రజానీకంనకు తీవ్ర యిబ్బందిగా వుంది. కావున మారిన నగర పరిస్థితుల దృష్ట్యా అదనంగా మరో రెండు కొత్త వాహనాలు (మహాప్రస్థానంలు) రెండు నెలల్లో ఏర్పాటు చేయవలసినదిగా కోరుతూ ప్రతిపాదించటమైనది.

31/104- రాజీవ్ అభ్యుదయ యోజన పథకం కొరకు దరఖాస్తు చేసుకున్న చేతి వృత్తి దారులు (బిసి.)లకు పని ముట్లు, రుణాలు వెంటనే ఇవ్వాలని కోరుతూ ప్రతిపాదించటమైనది.

32/105- నగరములో దీపం పథకంనకు దరఖాస్తు చేసుకున్న అర్హులకు వెంటనే గ్యాస్ కనెక్షనులు మంజూరు చేయ్యాలని ప్రతిపాదించటమైనది.

33/106-విజయవాడ నగరం వన్‌టౌన్ ప్రాంతములోని 25 మరియు 30 నుండి 40 డివిజన్లు అనగా 12 డివిజన్లలో పేద మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నివసిస్తున్నారు. మహిళలకు ఎక్కువగా ఉపయోగపడుచున్న జనాబ్ షేక్ రాజాసాహెబ్ నగరపాలక సంస్థ ప్రసూతి వైద్యశాల నందు అల్ట్రా స్కానింగ్ మిషన్‌ని ఏర్పాటు చేయకపోవడం వలన పలుమార్లు గర్భిణీ స్త్రీలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుచున్నారు. కావున వెంటనే ఈ ప్రసూతి హాస్పటల్ నందు అల్ట్రా స్కానింగ్ మిషన్‌ని ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించడమైనది.

<u>శ్రీమతి కొప్పరపు శ్రీదేవి, 59వ వార్డు మెంబరు గారి ప్రతిపాదనలు</u>-

34/107-ఎన్.ఎస్.సి., బోస్ నగర్‌లోని ఆరోగ్య కేంద్రంలో 8 నెలలుగా డాక్టరు గారు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. కనుక వెంటనే డాక్టరును నియమించుటకు చర్యలు తీసుకోవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

35/108-ఎన్.ఎస్.సి., బోస్ నగర్‌లోని డి.పి.స్టేషన్ నుండి బుడమేరు కట్ట వరకు వున్న మెయిన్ రోడ్డు బి.టి.దెబ్బతిని, గుంటలు ఏర్పడి ప్రయాణీకులకు అసౌకర్యంగా వున్నది. రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

<u>శ్రీ ఉమ్మడిశెట్టి బహదూర్, 14వ వార్డు మెంబరు గారి ప్రతిపాదనలు</u>-

36/109-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రతిష్టాత్మకముగా చేపట్టిన పావలా వడ్డీ రుణాలు మహిళలకు ఆర్థిక వెసులుబాటు కల్గించే విధంగా ఉండి వారి యొక్క కుటుంబ ఆర్థిక అవసరాలు తీర్చే విధంగా ఉండి ప్రజల మన్నలను పొందుచున్నది. కాని పేద వర్గాలు నివసించే ప్రాంతాలలో ప్రజలు నిరక్షరాశ్యులు అగుటచేత వారికి గ్రూపులు ఏర్పాటు, పొదుపు చేయుట, అప్పులిచ్చుట, వసూళ్ళు, బ్యాంకు జమలు, పుస్తకాలు వ్రాసుకొనుట తదితర వాటిలో సరియైన శిక్షణ లేక గ్రూపులు చాలా వరకు ఎక్కువ కాలం నిలువలేక మధ్యలోనే పొదుపులు ఆగిపోవుచున్నందున, ఎక్కడైయితే నిరుపేద మహిళలు నివసించే ప్రాంతాలు ఉంటాయో ఆ ప్రాంతాలలో మహిళలను చైతన్యపరచి గ్రూపుల పటిష్టతకు చర్యలు తీసుకొనక పోయినట్లయితే గ్రూపులు దెబ్బతిని ప్రభుత్వ పథకం నీరుగారిపోయి ప్రజల అసంతృప్తికి లోను అవుతుంది. మరియు చాలా బ్యాంకుల వారు రుణాలు ఇవ్వడానికి ఇబ్బంది పెట్టుచున్నారు. సాదారణంగా బ్యాంకులు నెలకొల్పేటప్పుడు అక్కడ వారి వ్యాపార కర్యకలాపాలు (డిపాజిట్ల సేకరణ,

రుణాలు ఇచ్చుట) ఉన్నచోట్ల బ్యాంకులు బ్రాంచ్‌లు నెలకొల్పుట జరుగుచున్నది. కానీ ఆయా బ్రాంచ్‌ల వారు వారి వ్యాపారభివృద్ధికి చూపించే చొరవ ఆ ప్రాంతాలలో నివసించే పేద మహిళలకు రుణాలు ఇచ్చుటలోను డ్వాక్వా గ్రూపుల అక్కౌంటులు ప్రారంభించుటలో శ్రద్ధ చూపకపోవట వలన డ్వాక్రా గ్రూపు మహిళలు సుదూర ప్రాంత బ్యాంకులను ఆశ్రయించడం వలన పావలా వడ్డీ రుణాలు అనుకున్నంత స్థాయిలో ప్రజలను మెప్పించలేక పోతున్నందున ఏ ప్రాంతంలో అయితే బ్యాంకులు ఉంటాయో, ఆ ప్రాంతములోని మహిళలకు అక్కౌంట్లు ప్రారంభించుట, రుణాలు మంజూరు చేయుటకు తగు చర్యలు తీసుకొనేటట్లు ఆదేశించవలసినదిగా ప్రతిపాదించడమైనది.

37/110- 14వ డివిజన్ అండర్ గ్రౌండు డ్రైయినేజీ కొరకు పనులు మొదలుపెట్టి ఇప్పటికి నాలుగు నెలలు అయినది. కాని పనులు మాత్రం 30 శాతం మాత్రమే పూర్తి అయినవి. ఇంకా 70 శాతం పూర్తి కావలసివున్నది. పనులు మొదలు పెట్టిన ఒక నెల రోజులు మాత్రమే పనిచేసి, మిగతా మూడు నెలలు పనిచేయకుండ నిలిపివేసినారు. 14వ డివిజన్‌లో చాలా వరకు ఇరుకు రోడ్లు, మట్టిరోడ్లు, బిటి. రోడ్లు అయినందున జూన్ మాసంలో వర్షాలు విరివిగా కురుస్తాయి కాబట్టి వర్షాకాలం లోపే మిగతా 70 శాతం పనులు పూర్తి చేయుటకు తగు చర్యలు తీసుకోవలసినదిగా ప్రతిపాదించడమైనది.

38/111- 14వ డివిజన్‌లోని కళానగర్‌లో సుమారు 200 గృహముల వారు నిరక్షరాస్యులు, వారికి కనీసం వారి పేరుతో సంతకం చేయుట కూడా రాని మధ్య, చిన్న వయస్సు ఉన్న పురుషులు మరియు మహిళలు. వారికి కనీసం వారి పేరు వారు వ్రాసుకొనేటట్లు నాలుగు అక్షరాలు చదువుకొనేటట్లు చేయుటకు వయోజన విద్యను నేర్పించవలసినదిగా ప్రతిపాదించడమైనది.

39/112- 14వ డివిజన్‌లోని కృష్ణానది పరివాహక ప్రాంతంలో కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడు నీటి సుడులు కారణంగా అక్కడక్కడ పెద్ద గుంటలు ఏర్పడి ఆ గుంటలలో నీరు చేరి ఉండుటవలన ఆ పరిసర ప్రాంతంలోని పిల్లలు, మరియు పెద్దలు ఆ గుంటలలో పడి ప్రాణాలు కోల్పోవుట జరుగుచున్నందున నదిలో వున్న నీటి సుడుల వలన ఏర్పడిన గుంటలను పుడ్చుటకు ఇరిగేషన్ వారికి తగు ఆదేశాలు విజయవాడ నగర కౌన్సిల్ ద్వారా ఆదేశించవలసినదిగా ప్రతిపాదించటమైనది.

<u>శ్రీమతి కోనేరు రమాదేవి, 9వ వార్డు మెంబరు గారి ప్రతిపాదనలు</u>-

40/113-కార్పోరేషన్ పరిదిలో గల లే అవుట్ స్థలాల గురించి కాని, రోడ్ల వెడల్పు గురించి కాని, కోర్టులో ఎన్నో సంవత్సరముల నుంచి ఉన్న వాటిపై అన్ని పార్టీలతోటి ఒక కమిటీవేసి, వాటిపై ఛర్చించి కౌన్సిల్ వారి ముందుంచి త్వరగా పరిష్కరించునట్లు తీర్మానము చేయవలసినదిగా ప్రతిపాదించడమైనది.

41/114-పటమట ఏరియాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి సిస్టమ్ ఏర్పాటుచేసి "5" సంవత్సరములుపైగా అయినది. దీనికి ఖర్చు కూడా షుమారుగా 40 కోట్లు పైగా ఖర్చుపెట్టటం జరిగినది. కానీ ఈ అండర్ గ్రౌండ్ సిస్టమ్‌కి కావలసిన మిషనరీ ఒక్కటికూడా లేదు. కౌన్సిల్ ద్వారా ప్రశ్నవేస్తే ఏడుసార్లు టెండర్లు పిలిచినా ఎవరు రాలేదు అని సమాధానము చెప్పినారు. కనుక ఈ విషయములు అన్నింటిపైన చర్చించి వెంటనే 3వ సర్కిల్‌కి మిషనరీ ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించటమైనది.

42/115- విజయవాడ కార్పోరేషన్ పరిదిలో 2007వ సంవత్సరం 9, 10 నెలలో ఇళ్ళు గురించి డోర్ టు డోర్ తిరిగి వ్రాసినారు, వ్రాసిన వారు వాళ్ళ ఇష్టానుసారము వ్రాయటం జరిగినది. కొన్ని వీధులలో కార్డు లేకుంటే వ్రాయనని చెప్పి, కొన్ని వీధులలో కార్డు లేకున్నా వ్రాయటం జరిగినది. కనుక ప్రతి వీధిలోనూ కార్డు లేకున్నా అక్కడ నివసిస్తున్నదీ లేనిదీ తెలుసుకొని అర్హులైన ప్రతి ఒక్కరికి కూడా ఇళ్ళు వచ్చునట్లు వ్రాయవలసినదిగా కోరుచున్నాను.

శ్రీ ఉమ్మడిశెట్టి బహదూర్, 14వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

43/116- విజయవాడ నగరపాలక సంస్థ ద్వారా ఇచ్చేటటువంటి వృద్దాప్య, వితంతు, వికలాంగుల పింఛనులు ప్రస్తుతం డి.ఆర్.డి.ఏ., వారి ద్వారా అర్హులను గుర్తించి ఇవ్వడం జరుగుతుంది. విజయవాడ నగరపాలక సంస్థలో 103 కౌంటర్ ద్వారా సేకరించిన అప్లికేషన్స్‌ను డి.ఆర్.డి.ఏ., వారికి పంపించి వారి ద్వారా పెన్షన్లు మంజూరు చేయడం జరుగుతుంది. కాని డి.ఆర్.డి.ఏ., వారు ఒక నిర్దిష్టమైన విధానాన్ని అవలంభించకపోవుట వలన చాలా మంది అర్హులకు పెన్షన్లు మంజూరు కావడం లేదు మరియు 103 కౌంటర్‌లో ఇచ్చినటువంటి లబ్దిదారుల జాబితా కూడా వరుస క్రమములో లేక అనేక అవకతవకలు జరుగుచున్నాయి. ముందు వారి కంటే వెనుక వారు ముందుగా పెన్షన్లు పొందుచున్నారు. అసలు వికలాంగులకు నెలల తరబడి పెన్షన్లు రాని పరిస్థితిలు ఉన్నవి. పై పరిస్థితులు పరిగణలోనికి తీసుకొని పూర్వం విజయవాడ నగరపాలక సంస్థ వారు 103 కౌంటర్ ద్వారా సేకరించిన అప్లికేషన్స్‌ను వరుస క్రమములో నగరంలో ఖాళీ అయిన పెన్షనుదారుల స్థానాలలో క్రొత్తగా పెట్టినటువంటి అప్లికేషన్స్‌లో డివిజన్‌లలో అర్హులైన వారిని గుర్తించి పెన్షన్లు మంజూరు చేయుట జరిగేది. కనుక పెన్షన్‌దారు గుర్తింపు నగరపాలక సంస్థ ద్వారా జరిగే విధానాన్ని ప్రవేశపెట్టవలసినదిగా కోరుతూ ప్రతిపాదించడమైనది.

శ్రీ దాసరి దాస్ ప్రకాష్, 16వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

44/117- విజయవాడ నగరములోని వివిధ ప్రాంతాలలో స్థానిక ప్రజలకు చైతన్యం కలిగించాలనే లక్ష్యంతో నగరపాలక సంస్థ నెలకొల్పిన రీడింగ్ రూములలో నిరుద్యోగ యువకులు పార్ట్ టైమ్ కేర్‌టేకర్స్‌గా గత 10, 15 సంవత్సరములుగా విధులు నిర్వర్తిస్తున్నారు. నాడు రూ.400/-లుగా ఉన్న వారి నెలసరి వేతనము ఇన్నినాళ్ళలో రూ.750/-లకు మాత్రమే పెరిగింది. ప్రస్తుతం విపరీతంగా పెరుగుతున్న ధరల నేపథ్యంలో వేతనములతో కుటుంబాన్ని పోషించు కోవటం అత్యంత కష్టసాధ్యంగా ఉన్నది. ఇటువంటి స్థితిలో కేర్‌టేకర్లు తమ వేతనములు పెంపుదల చేయమని కోరిన పాపానికి అధికారులు కేర్-టేకర్ల ఉపాధిని కాలరాయాలనే భావనతో మొత్తం రీడింగ్ రూముల వ్యవస్థనే నిర్వీర్యం చేసే పద్దతుల్లో రీడింగ్ రూములను శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు స్వాధీనపరచమని ఆదేశించటం ధారుణం. కనుక అధికారులు అనాలోచితమైన ప్రయత్నాలను విరమించుకొని రీడింగ్ రూములలో కేర్‌టేకర్లను కొనసాగించాలని, పెరుగుతున్న ధరవరల దృష్ట్యా వీరి నెలసరి వేతనములను పెంపుదల చేయాలని కోరుతూ ప్రతిపాదించటమైనది.

శ్రీ ఉమ్మడిశెట్టి బహదూర్, 14వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-

45/118- 14వ డివిజన్‌లో నివసించే ప్రజలలో అధిక భాగము రవాణా రంగ కార్మికులు అగుటచేత విధి నిర్వహణలో అనుకోని సందర్భములలో రోడ్డు ప్రమాదాల వలన మరియు ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధి వలన అనేక మంది మరణించుట జరిగినది. మరణించిన వారు అందరూ కూడ వయస్సులో చాలా చిన్న వారు కావడం వలన చిన్న చిన్న పిల్లలతో మహిళలు కూలి నాలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. వీరిలో అందరూ ఎన్.ఎఫ్.బి.ఎస్. పథకం క్రింద దరఖాస్తు చేసుకొని ఉన్నారు. మొన్న 2008 ఏప్రియల్ మాసంలో ఎన్.ఎఫ్.బి.ఎస్. పథకంలో ఒక్కరికి మాత్రమే డివిజన్‌లో అర్హులుగా గుర్తించి ఇచ్చినారు. కనుక డివిజన్‌లో ఉన్న మిగతా అర్హులైన మహిళలకు ఎన్.ఎఫ్.బి.ఎస్., పథకం క్రింద చెక్కులు పంపిణీ చేయవలసినదిగా డి.ఆర్.డి.ఎ., వారిని ఆదేశిస్తూ తగు సూచనలు చేయుటకు ప్రతిపాదించడమైనది.

46/119- విజయవాడ నగరపాలక సంస్థలో తనదైన ప్రత్యేక శైలిలో నీతి, నిజాయితీ, పట్టుదల, కార్యదీక్ష, సమయపాలన విధి నిర్వహణలో పైరవీలకు తావు లేకుండా తనదైన శైలిలో 2 1/2 సంవత్సరములు సేవలందించిన మున్సిపల్ కమీషనర్ అయిన శ్రీ నటరాజన్ గుల్జార్ గారి సేవలకు గుర్తింపుగా 14వ డివిజన్‌లోని రామలింగేశ్వర నగర్ పటమటలంకను కలుపుతూ నిర్మించేటటువంటి రెండు లైన్ల వంతెనకు శ్రీ నటరాజన్ గుల్జార్ వంతెనగా నామకరణం చేయవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీమతి టి.డి.వి.నాగలక్ష్మి, 47వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

47/120- 47వ డివిజన్ నందలి టి.ఆర్.ఎస్.ఎస్. యు.పి. స్కూలు నందు విద్యార్థుల శాతం తక్కువగా ఉన్నందున మరియు ఆ స్కూలు పూర్తిగా శిధిలావస్థలో ఉన్న కారణముగా ఆ స్థలము నందు కమ్యూనిటీ హాలు నిర్మాణమునకు అప్పటి గౌరవనీయులు కమీషనరు గారికి విన్నవించటం జరిగినది. కావున స్కూలు తరలింపు మరియు ఎం.ఎల్.ఏ., నిధులు యివ్వగా యింకనూ అవసరమైన 29 లక్షల రూపాయలను కార్పోరేషన్ జనరల్ బడ్జెట్ నందు కేటాయించవలసినదిగా ప్రతిపాదన.

శ్రీ బోయి సత్యబాబు, 37వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

48/121- విజయవాడ ఒన్ టౌన్ భవానీపురం ప్రాంతం పాతబస్తీలో సుమారు 14 డివిజన్లకు సంబంధించి నివసిస్తున్న హిందూ ప్రజలకి స్మశాన వాటికలో తగినంత స్థలం లేకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు. కావున, హిందూ స్మశాన వాటికకు అవసరమైన స్థలం కేటాయించవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీ దాసరి దాస్ ప్రకాష్, 16వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

49/122- విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో వృద్ధాప్య, వికలాంగ, వితంతు పెన్షన్ల కొరకు దరఖాస్తు చేసుకున్న వారిపై ఎంక్వయిరీ చేయించి, అర్హులను గుర్తించి కార్పోరేషన్ వైద్యాధికారి యిచ్చిన ఏజ్‌ప్రూఫ్ సర్టిఫికెట్ ఆధారంగా ఇందిరమ్మ గ్రామ సభలకు మునుపు పెన్షన్లను మంజూరు చేయటం జరిగింది. అలాగే ఇందిరమ్మ గ్రామ సభలలో కూడా రేషన్ కార్డులను ఆధారంగా చేసుకుని నూతన పెన్షన్‌దారులను ఎంపిక చేయటం జరిగింది. దరిమిలా లబ్ధిదారులందరకూ పెన్షన్లను పంపిణీ చేయటం జరుగుతుంది. కానీ తాజాగా పెన్షన్ తీసుకోవటానికి వెళ్ళిన లబ్ధిదారులలో రేషన్ కార్డులు వుంటేనే పెన్షన్ ఇస్తామని అధికార యంత్రాంగం చెప్పటంతో పెన్షన్‌దారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కనుక సంబంధిత కార్పోరేషన్ ఉన్నతాధికారులు ఈ అయోమయ అవస్థను తొలగిస్తూ స్పష్టమైన ప్రకటన చేయాలని; రేషన్ కార్డులతో ముడిపెట్టకుండా గతంలో లాగానే పెన్షన్లను పంపిణీ చేయాలని కోరుతూ ప్రతిపాదించుచున్నాను.

శ్రీమతి పెన్మెత్స దుర్గాభవాని, 53వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

50/123- 53వ డివిజన్ పరిధిలోని రామకృష్ణాపురం, దేవినగర్, అజిత్ సింగ్ నగర్‌లలో వీధుల పేర్లు, బ్లాక్ నెంబర్లను బోర్డుల ద్వారా వ్రాయించవలసినదిగా కోరుతూ ప్రతిపాదించడమైనది.

శ్రీ చిగురుపాటి బాబూరావు, 55వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

51/124- కేంద్ర ప్రభుత్వం పెంచిన డీజిల్, పెట్రోలు ధరలను వెంటనే ఉపసంహరించాలని కోరుతూ ప్రతిపాదించడమైనది.

శ్రీమతి కొప్పురపు శ్రీదేవి, 59వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

52/125- నగరంలో దీపం పథకం ద్వారా గ్యాస్ కొరకు అప్లికేషన్స్ పెట్టుకొన్న పేద, మహిళలకు వెంటనే గ్యాస్ అందించేందుకు చర్యలు చేపట్టవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీ చిగురుపాటి బాబూరావు, 55వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

53/126- విజయవాడ నగరపాలక సంస్థ వివిధ విభాగాలలో పనిచేయుచున్న ఎన్.ఎం.ఆర్. ఉద్యోగ కార్మికుల వేతనాలను గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 'బోర్డు ఆఫ్ చీఫ్ ఇంజనీర్స్' 2008-09 సంవత్సరానికి సంబంధించి నిర్ణయించి జారీ చేయబడిన ''కామన్ స్టాండర్డు షెడ్యూలు ఆఫ్ రేట్లు'' ప్రకారం 40% కార్పోరేషన్ సిటీ అలవెన్సుతో కలిపి ది.1-6-2008 నుండి సవరించి వేతనాలు అమలు జరుపవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీ కాశీనాథ్ దోనేపూడి, 23వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-

54/127- రానున్న లేదా ప్రస్తుత వర్షాకాల సీజన్‌ను గమనంలో వుంచుకొని నగరంలో మలేరియా, డయేరియా తదితర అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిందిగా కోరుతూ ప్రతిపాదించడమైనది.

55/128- 23వ డివిజన్ పరిధిలో నున్న ప్రాంతాల్లో ఈ క్రింద పేర్కొన్న ఏరియాల్లో కొత్త కరెంట్ పోల్స్ వేయించేందుకు తగు చర్యలు తీసుకోవలసిందిగా ప్రతిపాదించడమైనది.

1. 41-1/14-543/7 - ప్లాట్ నెం.47
2. 41-1/14-599 - ఎం.అప్పల నర్సమ్మ యింటి ఏరియా
3. 41-1/14-576 - తిరండి అప్పారావు యింటి ఏరియా, ప్లాట్ నెం.158
4. 41-1/14-657/3 - ఓర్సుల లక్ష్మి యింటి ఏరియా
5. 41-1/14-547 - బావిశెట్టి రమణమ్మ యింటి ఏరియా

పైన పేర్కొన్న ప్రాంతాల్లో కొత్త పోల్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాల్సిందిగా కోరుతూ ప్రతిపాదించడమైనది.

శ్రీ ఎరుబోతు రమణా రావు, 52వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-

56/129- 52వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరీ పేట నందు రీడింగ్ రూమ్ ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

57/130- 52వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేట నందు అండర్ గ్రౌండ్ డ్రైనేజి పూర్తి అయినటువంటి రోడ్లను సి.సి. రోడ్లుగా వేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

58/131- 52వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేట నందు మహిళా సోదరీ మణులకు కుట్టు మిషన్ కేంద్రం ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీ పి.గౌతమ్ రెడ్డి, 44వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-

59/132- విజయవాడ నగరపాలక సంస్థలో 15 సం.ములు పైబడి పనిచేయుచున్న 206 మంది యస్.యం.ఆర్. ఉద్యోగస్తులందరికీ ''బోర్డు ఆఫ్ చీఫ్ ఇంజనీర్స్'' వారిచే జారీ చేయబడిన ''కామన్ స్టాండర్డ్ షెడ్యూలు ఆఫ్ రేట్స్'' ప్రకారము 2008-09 సం.మునకు ''సవరించిన వేతనములు'' ది.01-06-2008 నుండి విజయవాడ నగరపాలక సంస్థలో పనిచేయుచున్న యస్.యం.ఆర్. ఉద్యోగస్తులందరికీ అమలు చేయవలసినదిగా (అన్-స్కిల్డ్ వర్కర్సనకు 40% ఏరియా ఎలవెన్సు కలిపి చెల్లించవలసినదిగా మరియు కంప్యూటర్ ఆపరేటర్స్/ టైపిస్టులకు గత సం.ము ఎస్.ఎస్.ఆర్.లో గల వేతనమును మరియు ప్రస్తుత ఎస్.ఎస్.ఆర్లో గల వేతనముతో పోల్చినట్లయితే, వేతనము నందు ఏ విధమైన పెరుగుదల ఇవ్వనందున, వాళ్ళకు కూడా ప్రస్తుత వేతనముపై 10% అదనముగా చెల్లించవలసినదిగా కోరడమైనది) ప్రతిపాదించడమైనది.

60/133-వర్షాకాలం ప్రారంభమయినందున నగర ప్రజలకు ముఖ్యంగా స్లమ్ ప్రాంతాలలో నివాసం వుండే వారికి డయేరియా మరియు అంటువ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుచూ ప్రతిపాదించడమైనది.

61/134- నగరంలోని రోడ్లపై కేబుల్ వారు, వాటర్, డ్రైనేజిల కొరకు త్రవ్వి వేసినారు. సదరు గుంటలను పూడ్చకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుచున్నారు. కావున, ప్యాచ్ వర్క్ చేయించాలని కోరుచూ ప్రతిపాదించడమైనది.

62/135- వర్షాకాలం ప్రారంభమయినందున నగరంలోని అన్ని డివిజన్లలో మొక్కలు నాటించాలని ''వన మహోత్సవం'' పేరిట నగరం మొత్తం మొక్కలు నాటించాలని కోరుచూ ప్రతిపాదించడమైనది.

శ్రీమతి మురిపాల సత్యవతి, 58వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

63/136-విజయవాడ నగరపాలక సంస్థ 58వ డివిజన్‌లోని రాజీవ్ గాంధీ ప్రాధమిక పాఠశాలను అప్-గ్రేడ్ చేయడం జరిగినది. ప్రస్తుతం ఉన్న తరగతి గదులు విద్యార్థులకు సరిపోవడం లేదు. కావున వెంటనే అదనపు తరగతి గదులు నిర్మాణం చేయుటకు తగు చర్యలు చేపట్టవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీ జి.కోటేశ్వర రావు, 29వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-

64/137- నగరపాలక సంస్థ పాఠశాలలో విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు మరియు ఫర్నిచర్ ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

65/138-నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రస్తుతం ఒక మహాప్రస్థానం వాహనం మాత్రమే ఉన్నది. పెరిగిన నగర జనాభా దృష్ట్యా కనీసం మరొక వాహనమైనా ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

66/139-వీధి లైట్ల నిర్వహణ ప్రక్రియలో లోపాలను సరిచేసి, సక్రమంగా లైట్లు పనిచేయుటకు చర్యలు తీసుకోవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీ పి.గౌతమ్ రెడ్డి, 44వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

67/140– మన రాష్ట్రంలోని 1965 పురపాలక సంఘాల, 1955 నగరపాలక సంస్థల చట్టాలను సమూలంగా సంస్కరించి, మేయర్లకు, ఛైర్‌పర్సన్స్‌కు, ప్రజా ప్రతినిధులకు తగినన్ని అధికారాలు కల్పించాలని, ప్రస్తుతం కమీషనర్లకున్న అత్యధిక అధికారాలను తగ్గించాలని, పలు ఆర్థిక కమీషన్ల సిఫార్సుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అర్బన్, స్థానిక సంస్థలకు గ్రాంట్లు సక్రమంగా యివ్వాలని, చట్టాలను మరింత ప్రజాస్వామ్యవంతం చేయాలని దీర్ఘకాలంగా చేస్తున్న ఆందోళన ఫలితంగా, మన రాష్ట్ర ప్రభుత్వం నూతన చట్టాన్ని రూపొందించుటకు కృషి ప్రారంభించటం హర్షదాయకం.

ఈ కృషిలో భాగంగా రాష్ట్ర పురపాలక శాఖ ఆధ్వర్యాన 2007 అక్టోబరు 8వ తేదీన హైదరాబాద్‌లో ఒక వర్క్ షాపును నిర్వహించారు. అందులో పురపాలక సంఘాలకు, నగరపాలక సంస్థలకు కలిపి ''ఏకీకృత మున్సిపల్ లా'' (Unified Municipal Law) ను ప్రతిపాదించారు. అందులోని కొన్ని ముఖ్య అంశాలు – అర్బన్ స్థానిక సంస్థల ఏర్పాటు, స్థాయీ సంఘ విధులు, కమీషనర్ల బాధ్యతలు, అధికారాలు, వగైరా 31 విధాన అంశాలు సూచిస్తూ, వాటిపై ప్రజాభిప్రాయ సేకరణకు ఒక చిన్న ప్రయత్నం చేసారు.

ఈ ప్రతిపాదనలపై ది.5-11-2007న మన విజయవాడలో మన మేయరు గారి అధ్యక్షతన జరిగిన ప్రధమ రాష్ట్ర మేయర్ల సమావేశం చర్చించి, ప్రభుత్వ ప్రతిపాదనలు ఏ మాత్రం సంతృప్తికరంగా లేవని, 74వ రాజ్యాంగ సవరణ చట్టం ఆదేశించిన ప్రజా ప్రతినిధులకు గల అధికారాలను విస్మరించబడ్డాయని, మేయర్స్, ఛైర్‌పర్సన్స్, కమీషనర్ల అధికారాలను స్పష్టంగా పేర్కొనాలని, యిందు కొరకు మేయర్లు రాష్ట్ర ముఖ్యమంత్రి గారిని కలిసి నూతన ప్రతిపాదిత చట్టములో అవసరమైన మార్పులను చేయాలని కోరుతూ తీర్మానించినారు.

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించుచున్న నూతన చట్టంలో విధిగా యీ దిగువ అంశాలు స్పష్టంగా వుండాలని మన కౌన్సిల్ కోరుతూ వుంది.

1) దీర్ఘకాలంగా మనం కోరుతున్న 1986 నుండి పశ్చిమ బెంగాలులో జయప్రదంగా, ప్రజారంజకంగా అమలవుతున్న మేయర్-ఇన్-కౌన్సిల్ విధానాన్నే మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలి. అందుకను గుణమైన నిబంధనలను, రూల్సును నూతన ప్రతిపాదిత చట్టము పొందుపరచాలి.

2) మేయర్సు, ఛైర్‌పర్సన్స్, నగర, పట్టణ సర్వోన్నత గౌరవ వ్యక్తులుగా నిర్వహించబడాలి.

3) పురపాలక, నగరపాలక సంస్థల్లోని అన్ని విభాగాలపైన, అందరి అధికారులు, ఉద్యోగులపై (కమీషనరుతో సహా) జనరల్ అజమాయిషీ మేయర్స్, ఛైర్‌పర్సన్స్‌కు అధికారాలు కల్గి వుండాలి. కమీషనర్లు ప్రభుత్వంతో, శాఖలతోను జరుపు అన్ని ఉత్తర, ప్రత్యుత్తరాలు మేయర్లు, ఛైర్‌పర్సన్స్ పేర్ల మీదనే జరగాలి.

4) రూ.5 లక్షల విలువైన అంచనాలను మేయర్లకు మంజూరు చేసే అధికారం వుండాలి. ఆయా మునిసిపాలిటీల గ్రేడ్‌లనుబట్టి ఛైర్‌పర్సన్స్‌కు మంజూరు అధికారం వుండాలి. ఏ పరిస్థితుల్లోనూ మేయరు, ఛైర్‌పర్సన్స్ కంటే హెచ్చు మొత్తం మంజూరు చేసే అధికారం కమీషనర్లకు వుండరాదు. బడ్జెట్‌లో లేని, లేదా కౌన్సిల్ ఆమోదం లేకుండా కొత్త పనులు చేపట్టడం కాని, లేదా తన స్వంత నిర్ణయాలతో కౌన్సిల్స్‌ను, కార్పోరేటర్లను నిస్సహాయులుగా చేస్తూ, కమీషనర్లు వ్యవహరిస్తూ, అధికార దుర్వినియోగానికి ఎటువంటి అవకాశం వుండరాదు.

5) అంతర్గతంగా చేసే బదిలీలన్నింటికి మేయరు, ఛైర్‌పర్సన్స్ ఆమోదంతోనే కమీషనర్లు చేయాలి.

6) కమీషనర్లకు క్యాజువల్ శెలవు మంజూరు అధికారం మేయరు, ఛైర్‌పర్సన్‌కు వుండాలి.

7) కమీషనర్ల కాన్ఫిడెన్షియల్ రిపోర్టును మేయరు, ఛైర్‌పర్సన్స్‌కు వ్రాసే అధికారం వుండాలి.

8) ప్రస్తుతం పురపాలక సంఘ చట్టంలోని ఛైర్‌పర్సన్స్‌కు గల అధికారాలు మేయర్లకు కల్పించాలి.

9) డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్స్ పూర్తిగా అలంకార ప్రాయంగా వున్నారు. వారికి మేయర్లు, ఛైర్‌పర్సన్ నిర్వహించే బాధ్యతలలో కొన్నింటిని వారికి బదిలీ చేసి, వారి సేవలను మరింత ప్రయోజనకరంగా చేయాలి.

10) కమీషనర్లు, గెజిటెడ్ ఆఫీసర్లు మినహా మిగతా అన్ని తరగతుల అధికార్లు, ఉద్యోగులను వారిపై వచ్చే ఆరోపణల తీవ్రతనుబట్టి, సస్పెండ్‌చేసి, విచారణానంతరం తగు క్రమ శిక్షణా చర్యలు తీసికొను అధికారం మేయర్లకు, ఛైర్‌పర్సన్స్‌కు వుండాలి.

11) కార్పోరేషన్‌లలో లక్షకు పైగా చెల్లింపులు చెక్కులపై మేయరు కూడా సంతకం చేసే అధికారం వుండాలి. అలాగే ఛైర్‌పర్సన్స్‌కు కూడా ఆయా గ్రేడ్‌లనుబట్టి చెక్కులపై సంతకాలు చేసే పరిమితి నిర్ణయించాలి.

12) ప్రతిపాదిత నూతన చట్టంలో మేయర్లకు, ఛైర్‌పర్సన్స్‌కు స్పష్టమైన అధికారాలు, బాధ్యతలు కల్పించాలి. మేయర్ల కంటే తక్కువ స్థాయి గల స్థాయీ సంఘం వారి అధికారాలను నిర్ణయించాలనే ప్రభుత్వ ప్రతిపాదన పూర్తిగా హాస్యాస్పదం.

13) 74వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం రాష్ట్ర ఆదాయంలో స్థానిక సంస్థల నిర్వహణకు, అభివృద్ధికి ఎంత శాతం గ్రాంట్లుగా యివ్వాలో నిర్ణయించే అధికారం గల రాష్ట్ర ఆర్థిక కమీషన్ సిఫార్సులను విధిగా రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి, అమలు జరపాలి (కేంద్ర ఫైనాన్స్ కమీషన్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఎట్టి మినహాయింపులు లేకుండా పూర్తిగా ఆమోదించి అమలు జరుపుచున్నట్లుగా రాష్ట్రములోనూ, ఆదే విధంగా అమలుకు నిబంధనలు వుండాలి).

14) స్థానిక సంస్థల అభివృద్ధికి కేంద్ర ఫైనాన్స్ కమీషన్ గ్రాంట్లను వాటి మధ్య రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకొంటూ స్థానిక సంస్థలకు తీవ్ర నష్టం కల్గించుచున్న అక్రమ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడనాడి, కేంద్రము నుండి రాష్ట్రానికి ఆ నిధులు రాగానే ఒక నెల లోపుగా స్థానిక సంస్థలకు అందజేయాలి.

15) నగరపాలక సంస్థలో, పురపాలక సంఘాలలో ఆయా ప్రాంతాల నుండి ఎన్నికైన పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, ఎక్స్-అఫిషియో సభ్యులుగా ఓటింగ్ హక్కు కూడా యిప్పుడు అమలులో వుంది. యిది సరికాదు. వారి ఓటు హక్కు వారి సభలలో పార్లమెంటు, శాసన సభ్యులకే వుంది, అందుచే యిక్కడ యివ్వరాదు.

16) పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలు తమ పరిధిలో అన్ని రకాల పన్నులు, ఫీజులు, రుసుములు, అద్దెలు, వాటర్, డ్రైనేజి ఛార్జీలు నిర్ణయించే అధికారం వుంది. కానీ ఆస్థి పన్ను విధింపు పెంపుదల విషయములో ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు అధికారం లేకపోవడం సోచనీయం. కొన్ని మార్గదర్శక సూత్రాలకు లోబడి, ఆస్థి పన్నుల విషయములో కూడా ఆయా కౌన్సిల్స్ నిర్ణయించేందుకు నిబంధనలను మార్చాలి.

17) స్థానిక సంస్థల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వానికి సాధారణ అజమాయిషీ, అధికారం వుండవలసిందే. కానీ యిటీవల కాలములో సర్వ సాధారణ ఏకగ్రీవ తీర్మానాలను సహితం నిరంకుశంగా రద్దుచేసే ప్రభుత్వ చర్యలు ప్రజాస్వామికం కావు. ఏదో అరుదైన సందర్భాలలో పర్యవసానాలు తీవ్ర నష్టాలకు, పరిణామాలకు దారి తీస్తాయనే ప్రమాదం వున్నా, అరుదైన సందర్భాలలో మాత్రమే ప్రభుత్వ జోక్యం వుండాలి.

18) మేయరు, ఛైర్‌పర్సన్స్‌ను తొలగించేందుకు ఏకంగా కౌన్సిల్, స్థాయీ సంఘాలను రద్దుచేసేందుకు ప్రస్తుత చట్టములోని నిబంధనలు అప్రజాస్వామికంగా వున్నాయి. అట్టి తీవ్ర నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితులలో ప్రభుత్వం హై కోర్టు న్యాయమూర్తి ద్వారా ఆరోపణలను విచారించి, వారిచే సిఫార్సులపైన చర్యలు తీసుకొనే అధికారము మాత్రమే ప్రభుత్వానికి వుండాలి.

19) చాలా కాలంగా అనేక స్థానిక సంస్థలలో పనిచేసే కొందరు ఉన్నత, దిగువ స్థాయి అధికారులు, ఉద్యోగులపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. వాటిపై విచారణలు జరుపుచూ వుంటారు. కానీ వాటి పర్యవసానాలపై ఏ చర్యలు తీసుకొంటున్నారో కూడా ఆయా కౌన్సిళ్ళకు తెలియదు. ఇది సరైన స్థితికాదు. అట్టి విచారణా ఫలితాలను విధిగా ఆయా కౌన్సిల్స్‌కు ప్రభుత్వం తెలియజేసేందుకు అవకాశం నూతన చట్టంలో వుండాలి.

20) ఇంకొక ముఖ్యమైన అంశం మాతృ భాషలోనే అన్ని చట్టాలు, రూల్సు ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలనే ప్రభుత్వ నిర్ణయం వున్నా, అవి అమలు జరగడం లేదు. అందుచేత నూతన చట్టం దానిక్రింద నిబంధనలు – వగైరా అన్నీ తెలుగులోనే వుండాలని కౌన్సిల్ ధృఢమైన అభిప్రాయం.

పై మన కౌన్సిల్ అభిప్రాయాలను రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి, పురపాలక శాఖామాత్యులకు, ఉన్నతాధికారులకు వివరించేందుకు, వారిని ఒప్పించేందుకుగాను మేయరు గారి ఆధ్వర్యములో వివిధ పక్షాల

ఫ్లోర్ లీడర్లు, ఉప ఫ్లోరు లీడర్లు, స్థాయీ సంఘ సభ్యులతో కూడిన ప్రతినిధి వర్గాన్ని పంపుటకు యీ కౌన్సిల్ నిర్ణయించాలని మేయరు గారు వెంటనే తగు చర్యలు తీసుకొనవలసినదిగా కోరటమైనది.

ఈ తీర్మానాన్ని రాష్ట్రములోని అందరు మేయర్లకు, ఛైర్‌పర్సన్స్‌కు తక్షణం పంపవలసినదిగా కమీషనర్ గారిని కోరుతూ ప్రతిపాదించడమైనది.

<u>శ్రీ డి.వి.రమణబాబు, 31వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-</u>

68/141- 31వ డివిజన్ చిట్టినగర్ ఏరియాలోని శాలివాహన సంఘం వీధులలో షుమారు గత 50 సం.ముల నుండి రేకుల ఇల్లు, పెంకుటిల్లు మరియు ఎక్కువ భాగం డాబా ఇళ్ళల్లో స్థిర నివాస మేర్పచుకొని జీవనము సాగిస్తున్నారు. వీరికి 1981వ సం.ములో ఆర్.యస్. నెం.148/1లో షుమారు 210 ఇళ్ళకు ప్రభుత్వం వారు పట్టాలు ఇచ్చి ఉన్నారు. అందు సుమారు 25 పట్టాలకు రిజిస్ట్రేషన్‌లు కూడా చేసినారు. మిగిలిన 185 ఇళ్ళకు ఇచ్చిన పట్టాలను రిజిస్ట్రేషన్‌లు చేయుమని అనేక సంవత్సరాల నుండి వారు విన్నవించుకొనుచున్నారు. అలాగనే రాష్ట్ర ప్రభుత్వం గత 4 సం.ముల నుండి నిర్వహించిన ప్రజాపథం - ప్రభుత్వ కార్యక్రమములో సదరు 185 ఇళ్ళవాళ్ళు మహజరు పిటీషనులు, స్థానిక కార్పోరేటర్లుగా 4 ప్రజాపథం కార్యక్రమాల్లో నేను కూడ విజ్ఞప్తిచేసి ఉన్ననూ ఫలితము లేదు.

కావున, ఇప్పటికైనా శాలివాహన సంఘం వీధులలో నివసిస్తున్న 185 ఇళ్ళ పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయించు నిమిత్తం తక్షణమే పరిశీలించి తగు చర్యలు తీసుకోవలసినదిగా ప్రతిపాదన.

69/142- 31వ డివిజన్ కె.ఎల్. రావు నగర్‌లోని మున్సిపల్ స్థలములో గత 30 సం.ముల నుండి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు చిన్న చిన్న ఇళ్ళు నిర్మించుకొని 43 కుటుంబముల వారు స్థిర నివాసమేర్పచుకొని జీవనము సాగిస్తున్నారు. ఓ.డి.ఎ. నిధుల నుండి డ్రైన్‌లు, సి.సి. రోడ్లు మరియు వీధి లైట్లు కూడా ఏర్పాటు చేయగా, సదరు ఇళ్ళకు ఆస్థి పన్ను, నీటి పన్ను కూడ చెల్లించుచున్నారు. గత 10 సం.ముల నుండి సదరు 43 ఇళ్ళకు రిజిస్ట్రేషన్లు, పట్టాలు మంజూరు చేయుమని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించుకొన్ననూ ఫలితము కన్పించ లేదు. అలాగనే గత 4 సం.ముల నుండి కూడ రాష్ట్ర ప్రభుత్వం వారు నిర్వహించిన 4 విడతల ప్రజాపథం కార్యక్రమాలలో విజ్ఞాపన పత్రాలు ఇచ్చిననూ ఇంత వరకు పరిష్కరించలేదు.

కావున కె.ఎల్. రావు నగర్ మున్సిపల్ స్థలంలో నివసిస్తున్న 43 బడుగు, బలహీన వర్గాల ఇళ్ళకు రిజిస్ట్రేషన్ పట్టాలు ఇచ్చు నిమిత్తం పరిశీలించి తగు చర్యలు తీసుకోవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

<u>శ్రీమతి చెన్నూరి సుభాషిణి, 36వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-</u>

70/143- 36వ డివిజన్ నందు యునానీ హాస్పిటల్ రేకుల షెడ్లు తొలగించి, బిల్డింగ్ నిర్మాణము, కీ॥ శే॥ మోటూరు హనుమంతరావు నగరపాలక సంస్థ పాఠశాలకు అదనపు తరగతి గదుల నిర్మాణం, డివిజన్ నందు వివిధ వీధుల పేర్లు తెలియజేస్తూ, నేమ్ బోర్డుల ఏర్పాటు వంటి కౌన్సిల్ ఆమోదించిన తీర్మానాలపై వెంటనే తగు చర్యలు చేపట్టవలసినదిగా ప్రతిపాదించడమైనది.

71/144- 36వ డివిజన్ నందు వివిధ ప్రాంతాలలో వీధి రోడ్లు కల్వర్టులు దెబ్బతిని మురుగు నీరు ప్రవహించకపోవడం, ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు.

1) సి.ఎస్.ఐ. చర్చి ఎదురు కల్వర్టు.
2) మహాలక్ష్మి గుడి వీధిలో కల్వర్టు.
3) ఈపిన వారి వీధిలో కల్వర్టు.
4) యిర్సప్ప గుడి వీధిలో కల్వర్టు.
5) బడే సాహెబ్ వీధిలో కల్వర్టు.
6) నారాయణ స్వామి వీధిలో కల్వర్టు.
7) ఏనుగుల వారి వీధిలో కల్వర్టు.

పై తెల్పిన వీధులలో కల్వర్టులు నిర్మించవలసినదిగా ప్రతిపాదించడమైనది.

72/145– విజయవాడ 36వ డివిజన్ నందు ఈ క్రింది ప్రాంతాలలో రోడ్లు, సైడ్ డ్రైన్స్, మెట్లు పాడైపోయి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు.

1) రామాలయం వీధి మెట్లు, సైడ్ డ్రైన్స్ ఇరు వైపులా నిర్మించాలి.
2) వినాయకుని గుడి వీధి మెట్లు, సైడ్ డ్రైన్స్ ఇరు వైపులా నిర్మించాలి.
3) ఇర్లప్ప గుడి వీధి మెట్లు, సైడ్ డ్రైన్స్ ఇరు వైపులా నిర్మించాలి.
4) నూకల వారి వీధి రోడ్డుకి ఇరు వైపులా సైడ్ డ్రైన్స్ నిర్మిస్తూ రోడ్డు వేయవలెను.
5) యూసఫ్‌ఖాన్ వీధి రోడ్డుకి ఇరు వైపులా సైడ్ డ్రైన్స్ నిర్మిస్తూ మెట్లు, రోడ్లు వేయవలెను.

పై తెల్పిన వీధులలో రోడ్లు, సైడ్ డ్రైన్స్, మెట్లు నిర్మించవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీమతి పెన్మెత్స దుర్గాభవాని, 53వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :–

73/146– విజయవాడ నగరపాలక సంస్థలో 15 సం.ములు పైబడి పనిచేయుచున్న 206 మంది యన్.యం.ఆర్. ఉద్యోగస్తులందరికీ ''బోర్డు ఆఫ్ చీఫ్ ఇంజనీర్స్'' వారిచే జారీ చేయబడిన ''కామన్ స్టాండర్డ్ షెడ్యూలు ఆఫ్ రేట్స్'' ప్రకారము 2008–09 సం.మునకు ''సవరించిన వేతనములు'' ది.01–06–2008 నుండి విజయవాడ నగరపాలక సంస్థలో పనిచేయుచున్న యన్.యం.ఆర్. ఉద్యోగస్తులందరికీ అమలు చేయవలసినదిగా (అన్–స్కిల్డ్ వర్కర్స్‌నకు 40% ఏరియా ఎలవెన్సు కలిపి చెల్లించవలసినదిగా మరియు కంప్యూటర్ ఆపరేటర్స్/టైపిస్టులకు గత సం.ము ఎస్.ఎస్.ఆర్.నకు మరియు ప్రస్తుత ఎస్.ఎస్.ఆర్‌నకు వేతనము నందు వ్యత్యాసము చూపనందున వాళ్ళకు కూడా ప్రస్తుత వేతనముపై 10% అదనముగా చెల్లించవలసినదిగా కోరడమైనది) ప్రతిపాదించడమైనది.

74/147– నగరంలో గ్యాస్ కనెక్షన్ కొరకు దరఖాస్తు చేసుకొన్న అర్హులైన వారందరికీ గ్యాస్ కనెక్షన్స్ ఇవ్వవలసినదిగా కోరుతూ ప్రతిపాదించడమైనది.

75/148– నగరంలో వివిధ అభివృద్ధి పనులు పూర్తి అయినప్పటికీ, వాటి కోసం త్రవ్విన గోతులు వెంటనే పూడ్చనందున పాదచారులు, వాహనాలు నడపటానికి కూడా వీలులేని పరిస్థితి వుంది. వర్షాల వలన దారి కనపడక అనేక ప్రమాదాలకు గురి కావలసి వస్తున్నది. కనుక నగరంలో అభివృద్ధి జరిపిన ప్రాంతాలలో అన్ని రోడ్లను పునర్నిర్మించవలసినదిగాను, అవసరమైన చోట్ల ప్యాచ్ వర్క్ చేయవలసినదిగా ప్రతిపాదన.

76/149– నగరంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ వెంటనే కార్డులు ఇవ్వవలసినదిగాను, తెల్ల కార్డు ఆదాయ పరిమితిని 24 వేల నుండి 75 వేలకు పెంచవలసినదిగాను రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రతిపాదన.

శ్రీ నడకుదిటి సుబ్బరాజు, 12వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :–

77/150– 12వ డివిజన్ నందు గల ఎన్.టి.ఆర్. సర్కిల్ నుండి రామలింగేశ్వర నగర్ వెళ్ళు దారిలో గల నాలుగు రోడ్ల సెంటర్ (రాఘవ నగర్ రోడ్డు నుండి దర్శిపేటను కలుపు రోడ్డు) నందు సర్కిల్ ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించుచూ ఆ సర్కిల్ నందు మాజీ ఎం.ఎల్.ఏ., దివంగత శ్రీ చెన్నుపాటి రామకోటయ్య గారి విగ్రహం ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించడమైనది.

78/151– 12వ డివిజన్ నందు గల ఎయిర్‌టెల్ ఆఫీసు వెనుక వైపు గల కాలనీకి ''శ్రీ చెన్నుపాటి బ్రదర్స్'' అని పేరు పెట్టవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీమతి మురిపాల సత్యవతి, 58వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :–

79/152– విజయవాడ నగరపాలక సంస్థ 58వ డివిజన్ సుందరయ్య నగర్ రామాలయం వద్ద నగరపాలక సంస్థ ద్వారా పునరావాసం కల్పించబడిన నిరుపేద నివాసస్తులకు ఇంటి స్థలాలు రిజిస్ట్రేషన్ చేయబడలేదు. వారికి 50 గజాలు, మరికొందరికి 24 గజాలు చొప్పున స్థలాలు కేటాయించినప్పటికీ రిజిస్ట్రేషన్ చేయలేదు. కావున, అక్కడ నివసించే వారికి స్వల్ప రేటు నిర్ణయించి రిజిస్ట్రేషన్ చేయుటకు తగు చర్యలు చేపట్టాలని ప్రతిపాదించడమైనది.

శ్రీమతి కాజా సరోజ, 19వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-

80/153- విజయవాడ 19వ డివిజన్ సీతారాంపురం కడియాల వారి వీధి 1, 2 క్రాస్ రోడ్ల నందు మరియు రామనాథం వీధులలో భూగర్భ డ్రైనేజి మెయిన్ పైపు లైన్లు గత 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేయబడినవి. ప్రస్తుతం స్థానిక నివాస గృహాల సంఖ్య పెరిగి పైపు లైను తరచూ పొంగి, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు. కావున పాత పైపు లైన్ల స్థానంలో పెద్ద సైజు మెయిన్ పైపు లైన్లు ఏర్పాటు చేయుటకు తగు చర్యలు చేపట్టవలసినదిగా ప్రతిపాదించడమైనది.

81/154- విజయవాడ 19వ డివిజన్ నిమ్మతోట సెంటర్ ఇజ్జాడ అప్పలనాయుడు వీధి 6, 7 క్రాస్ రోడ్ల మధ్య ప్రాంతంలో నివసించే వారికి రిటైనింగ్ వాల్ నిర్మాణం, అలాగే కాట్రగడ్డ వెంకట నారాయణ వీధిలో వాహనాల ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేయుటకు తగు చర్యలు చేపట్టాలని ప్రతిపాదించడమైనది.

82/155- విజయవాడ 19వ డివిజన్ పిన్నమనేని హాస్పిటల్ రోడ్డు మరియు బెల్లపు శోభనాద్రి వీధి రోడ్లు వెడల్పు చేయునపుడు అక్కడ ఉన్న సైడ్ డ్రైన్లు పడిపోవడం జరిగినది. అందువలన స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు. పిన్నమనేని హాస్పిటల్ రోడ్డు రామారావు గారి హాస్పిటల్ నుండి ఆర్.సి.ఎం. చర్చి వరకు సైడ్ డ్రైన్ల నిర్మాణం, బెల్లపు శోభనాద్రి గ్రంధాలయం నుండి డోర్ నెం.34-2-20 వరకు సైడ్ డ్రైన్లు నిర్మాణం చేపట్టవలసినదిగా ప్రతిపాదించడమైనది.

83/156- 19వ డివిజన్ బ్రహ్మానంద రెడ్డి నగర్ 4, 5 క్రాస్ రోడ్ల జంక్షన్ వద్ద కొత్త కరెంటు స్తంభం మరియు లైటు ఏర్పాటు చేయవలసినదిగాను, మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీలో బోరింగ్ పంపు వద్ద జంక్షనులో కొత్త కరెంటు స్తంభం మరియు లైటు ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీ మహదేవు అప్పాజీరావు, 38వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-

84/157- విజయవాడ నగర పరిధిలో కాలుష్యము నివారించుటకు మరియు నగరమును సుందరముగా తీర్చిదిద్దుటకు ఈ వర్షా కాలములో అన్ని డివిజన్‌లలో మొక్కలు నాటే కార్యక్రమములను నగర ప్రజలందరి సహకారంతో, సమన్వయముతో రూపొందించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను. మరియు ప్రతి డివిజన్‌కు ట్రీ గార్డ్స్ కూడా కేటాయించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

85/158- విజయవాడ నగరపాలక సంస్థ నందు Street Lighting 'Real Energy' వారికి అప్పగించిన తరువాత, 'Real Energy' వారు Boxes అమర్చిన తరువాత విజయవాడ నగరంలో వీధి లైట్ల యొక్క మెయింటనెన్స్ అధ్వాన్నంగా తయారైనది. నగరపాలక సంస్థ స్ట్రీట్ లైటింగ్ మెరుగైన రీతిలో (ఇంతకు ముందు ఉన్న మెయింటనెన్స్ స్థాయికి చేర్చుటకు) ఉండేట్లు చేయుటకు కార్పోరేషన్ ఎలక్ట్రికల్ సిబ్బంది మరియు 'Real Energy' ను సమన్వయపరచుటకు తగు చర్యలు వెంటనే తీసుకొనవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీ బుద్దా జగన్నాధం, 25వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-

86/159- శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానము అభివృద్ధిలో భాగంగా అర్జున వీధిని 60 అడుగుల మేర విస్తరించాలని నిర్ణయించినారు. అర్జున వీధిలో గల ప్రభుత్వ స్థలములు మరియు గోసాల వైపు విస్తరణ చేయాలని దేవస్థానం మరియు కార్పోరేషన్ వారు నిర్ణయించినారు. ఈ విస్తరణ కార్యక్రమము శర వేగంగా జరుగుతున్న ఘాట్ రోడ్డు విస్తరణ మరియు కొండ చరియలు తొలగింపు పనులు, పూర్తి అయిన వెంటనే ఘాట్ రోడ్డు మార్గము ద్వారా భక్తులను అనుమతించిన తరువాత మొదలుపెడితే భక్తులకు ఎటువంటి ఆటంకము కలుగకుండా ఉంటుంది. కావున ఘాట్ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేసి భక్తులను అనుమతించిన పిదప అర్జున వీధి విస్తరణ చేపట్టుట గురించి ప్రతిపాదన.

**87/160–** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ''రాజగోపురం'' నిర్మాణము కొరకు స్థల సేకరణ నిమిత్తం సుమారు **90** ఇళ్ళు తొలగించి వారికి దేవస్థానం వారు నష్టపరిహారం చెల్లించినారు. రెండో విడత తీసిన **41** ఇళ్ళలో కార్పోరేషన్ స్థలమును కూడా ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా దేవస్థానం ఆధీనంలో ఉంచుకున్నారు. ఇంతకు ముందు కార్పోరేషన్ స్థలములో మరుగుదొడ్లు కలవు. వాటి వలన స్థానికులకు ఎటువంటి ఉపయోగం లేదని నిర్ధారించి, వాటి స్థానంలో రీడింగ్ రూమ్ ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించినాను. కార్పోరేషన్ అధికారులు మరుగుదొడ్లు తొలగించి రీడింగ్ రూమ్ కట్టుటకు సన్నాహాలు జరుగుతుండగా, దేవస్థానం వారు రాజగోపురం నిర్మాణమునకై, కార్పోరేషన్ వారికి ఎటువంటి సమాచారం తెలుపకుండానే కార్పోరేషన్ స్థలమును దేవస్థానం వారు స్వాధీనపరచుకున్నారు. అట్లాగే తొలగించిన **90** ఇళ్ళకు ముందు గల కార్పోరేషన్ రోడ్లు, మెట్లు కలవు. ఈ రోడ్లు మరియు మెట్లుకు సంబంధించిన స్థలము కూడా కార్పోరేషన్ వారిదే, కనుక మొత్తం కార్పోరేషన్ స్థలమును ఎటువంటి సమాచారం ఇవ్వకుండా దేవస్థానం వారు ఏ హక్కుతో స్వాధీనపరచుకున్నారో వివరణ కోరుతూ, తగిన నష్టపరిహారం దేవస్థానం వారు కార్పోరేషన్‌కు జమ చేయవలసినదిగా కోరుచూ ప్రతిపాదించుచున్నాను.

**88/161–** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం వారు ఘాట్ రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా ఘాట్ మొదలులో గల కార్పోరేషన్‌కు సంబంధించిన **13** షాపులను తొలగించినారు. తొలగింపు సమయంలో **13** షాపుల వారికి షాపులు కేటాయిస్తామని హామీ ఇచ్చినారు. కాని ఇంత వరకు **13** షాపులు కేటాయింపు జరుగలేదు. కావున, కార్పోరేషన్ అధికారులు, దేవస్థానము వారితో చర్చించి, **13** షాపులను త్వరగా కేటాయించాలని కోరుతూ ప్రతిపాదించుచున్నాను.

<u>శ్రీమతి కోళ్ల సుధారాణి, **32**వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు</u> :-

**89/162–** రాయన కొండల వారు ఇంటి నుండి బంగారయ్య కొట్టు సందు వరకు గల సైడ్ డ్రైన్ పగిలిపోయి శిథిలావస్థలో ఉన్నది. కావున దానిని **2** అడుగుల డ్రైన్‌గా వేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

**90/163–** విజయశాంతి కాన్వెంట్ రోడ్డు నుండి రామచంద్ర రాజు వీధి వరకు సైడ్ డ్రైన్ ల్యాండింగ్‌లు, మెట్లు వేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

**91/164–** తొత్తడి నాగేశ్వర రావు ఇంటి నుండి కమ్యూనిటీ హాల్ వరకు సైడ్ డ్రైన్, మెట్లు, ల్యాండింగ్‌లు వేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

<u>శ్రీమతి తాడి శకుంతల, ఎక్స్-మేయరు మరియు **7**వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు</u> :-

**92/165–** మొగల్‌రాజపురంలో నీటి ఎద్దడి చాలా ఎక్కువగా వుండుట వలన మంచినీటి రిజర్వాయర్ కొరకు గతంలోనే కమీషనర్ గారికి చెప్పటం జరిగింది. **7**వ డివిజన్‌లో వున్న కొండ ప్రాంతమైనా, క్రింది ప్రాంతమైనా రిజర్వాయర్ ఏర్పాటుకు అనుమతి యిచ్చి, " E + " సంస్థకు పంపియున్నారు. అంచనాలను వెంటనే వేయించి రిజర్వాయరు కట్టుటకు త్వరితగతిన చర్యలు తీసుకొనవలెనని ప్రతిపాదించడమైనది.

93/166 - BSUP పథకంలో వర్షా కాలములో వచ్చే ప్రమాదాలను ముఖ్యంగా కొండ ప్రాంతాలలో నివారించుటకు రిటైనింగ్ వాల్స్, పాడైపోయిన రోడ్లు, మెట్లు శాంక్షన్ చేయవలసిందిగా, 7వ డివిజన్‌లో రావిచెట్టు ప్రాంతం, సి.ఎస్.ఐ. చర్చి ప్రాంతం, వాటర్ ట్యాంక్ ప్రాంతంలో యీ సమస్యలను తీర్చవలసిందిగా ప్రతిపాదించుచున్నాను.

**94/167–** **7**వ డివిజన్‌లో నివసించే పేద, మధ్య తరగతి వర్గాల పిల్లలకు పాఠశాలలు ప్రైవేటు వారివే వుండటం వల్ల, చాలా ఫీజులు కట్టుకోలేక యిబ్బందులు పడుచున్నారు. నగర పునర్విభజనలో యీ డివిజన్‌లో కార్పోరేషన్ పాఠశాల లేకపోవడంతో ప్రభుత్వం అందించే ఉచిత విద్యకు దూరంగా పేద, బడుగు వర్గాలు ఎక్కువగా వుండే రావిచెట్టు ప్రాంతంలో బహు యిబ్బంది పడుతున్నారు. మన కార్పోరేషన్‌లో నూతనంగా వచ్చిన ఇంగ్లీషు మీడియం పాఠశాలల కోటాలో డివిజన్‌లో ఇంగ్లీషు మీడియం ప్రాథమిక పాఠశాలను కేటాయించవలసిందిగా యీ విద్యా సంవత్సరములోనే ప్రజలకు అందుబాటులోకి తేవాలని, గతంలో కొన్ని స్థలాలు అన్యాక్రాంతము అవ్వకుండా కార్పోరేషన్ పరిధిలోకి తెచ్చిన స్థలాల్లో, పాఠశాలకు ఉపయోగపడే స్థలం కలదు. ఆ వైపుగా **7**వ డివిజన్‌లో పాఠశాల ఏర్పాటుకు ఆమోదం తెలుపవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

<u>శ్రీ జి.కోటేశ్వర రావు, 29వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు</u> :-

**95/168**- విద్యాధరపురం రామరాజ్య నగర్ సితార సెంటర్‌లో హైమాస్ట్ లైట్లు గల డివైడర్‌లో కార్మిక నాయకుడు, మాజీ కౌన్సిలర్ మరియు మాజీ పశ్చిమ నియోజక వర్గ శాసన సభ్యులు కీ॥ శే॥ ఉప్పలపాటి రామచంద్ర రాజు గారి ఫుల్ సైజు కాంశ్య విగ్రహము ప్రతిష్ఠించుటకును, సదరు సెంటర్‌కు ఉప్పలపాటి రామచంద్రరాజు సర్కిల్‌గా నామకరణము చేయుటకు అనుమతించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

విగ్రహమునకు అయ్యే ఖర్చు రామచంద్ర రాజు గారి పేరున గల ట్రస్టు వారు భరించుటుగాను సిద్ధముగా ఉన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు అనుమతిస్తూ తీర్మానము చేయవలసినదిగా కోరటమైనది.

**96/169**- రిజిస్ట్రేషన్ లేనటువంటి పట్టాదారుల ఇళ్ళకు ఇంటి పన్నులు మార్చుకునే అవకాశం కల్పిస్తూ చర్యలు తీసుకోవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

సెక్రటరీ,
విజయవాడ నగరపాలక సంస్థ.

అందరు వార్డు మెంబర్లకు మరియు ఎక్స్-అఫిషియో మెంబర్లకు.

నకలు:- స్థాయీ సంఘ ఛైర్‌పర్సన్ మరియు మేయరు గారికి,
,, డిప్యూటీ మేయరు గారికి,
,, కో-ఆప్టెడ్ మెంబర్లకు,
,, కమీషనరు గారికి మరియు అదనపు కమీషనరు (జనరల్) గారికి,
,, ఎగ్జామినర్ గారికి మరియు అందరు అధికారులకు,
,, అందరు సూపరింటెండెంటులకు,
,, నోటీసు బోర్డునకు.

ది.20-06-2008 శుక్రవారము ఉదయము గం.10.30 ని॥లకు జరుగు
సాధారణ సర్వ సభ్య సమావేశమునకు కమీషనరు గారిచే ప్రవేశపెట్టబడిన అదనపు అంశములు

...

97/170- విజయవాడ నగరములో ప్రస్తుతము ప్రధాన సమస్యలలో ట్రాన్స్‌పోర్టేషన్ (ప్రయాణ సదుపాయము) సమస్య ఒకటిగా యున్నది. నగర జనాభా పెరుగుచున్నది. ట్రాఫిక్ సమస్య జటిలమవుతున్నది మరియు నగరము ప్రధానముగా కృష్ణానది నుండి ఏర్పడిన మూడు కాలువల (బందరు, రేవిస్, ఏలూరు) పొడవునా అభివృద్ధి జరిగియున్నది. ఈ కాలువలు ఇరు ప్రక్కల అభివృద్ధి అయిన ప్రాంతములను కలుపుటకు కాలువలు అవరోధములుగా నిలిచినవి. ఇందువలన ఒకే నగరములో గల వివిధ ప్రాంతముల ప్రయాణ సదుపాయము(కనెక్టివిటి) దెబ్బతినుచున్నది. కావున ఈ సమస్యలను పరిష్కరించు నిమిత్తము అవరోధముగా వున్న కాలువపై బ్రిడ్జిల నిర్మాణము జరగవలసివున్నది.

శ్రీ శిష్టా రామలింగమూర్తి, 51 వార్డు కార్పొరేటర్ గారు, 51 వ వార్డులో అయోధ్యనగర్ నుండి ముత్యాలంపాడు వైపు వెళ్ళుటకు, శ్రీ అల్లూరి సీతారామరాజు కళ్యాణమండపం వద్ద ఏలూరు కాలువపై వంతెన ఏర్పాటు చేయుటకు ప్రతిపాదించివున్నారు. కౌన్సిల్ తీర్మానము 644 ది.29-12-2005 నందు బ్రిడ్జి నిర్మాణము నిమిత్తము రిమార్కులు కోరియున్నారు.

ఈ బ్రిడ్జి ఏలూరు కాలువపై, శ్రీ అల్లూరి సీతారామరాజు కళ్యాణమండపం వద్ద అయోధ్యనగర్ నుండి ముత్యాలంపాడు, సత్యానారాయణపురం వైపు నిర్మాణము చేయవలసివున్నది. ఈ బ్రిడ్జి అయోధ్యనగర్, ఆర్.ఆర్.పేట, కంసాలిపల్లి మరియు వేగముగా అభివృద్ధి చెందుచున్న అతి పెద్ద కాలనీ అయినటువంటి లోటస్ ల్యాండ్ మార్కులను సత్యానారాయణపురం మరియు సిటి రెండో భాగములతో కలుపును. స్లమ్ ఏరియాలు అయినటువంటి అయోధ్యనగర్ ఆర్.ఆర్.పేట, కంసాలిపల్లి మొదలగు కాలనీలు విద్యాభివృద్ధి కొరకు సత్యానారాయణపురంలో ఉన్నటువంటి స్కూళ్ళపై ఆధారపడవలసివున్నది. ఈబ్రిడ్జి నిర్మాణము వలన పై కాలనీలలో నివసించు మధ్య తరగతి మరియు దిగువ తరగతి ప్రజలు ప్రయోజనము పొందుదురు. ఈ ప్రాంతములకు సిటిలో గల ఇతర ప్రాంతములతో చక్కటి ప్రయాణ సదుపాయములు ఏర్పడును. ఈ బ్రిడ్జి స్థలమునకు ఎగువ భాగమున సుమారు 400 మీటర్ల దూరములో ఒక బ్రిడ్జి కలదు, కాని ఈ బ్రిడ్జిపై నూజివీడు వైపు వెళ్ళు వెహికల్స్ వలన మరియు కేదారేశ్వరపేట మరియు ఒన్-టౌన్ నుండి వచ్చు వాహనములవలన తరచు ట్రాఫిక్ అంతరాయము కలుగుచున్నది. ఈ బ్రిడ్జి స్థలమునకు దిగువున సుమారు 0.6 కి.మీ దూరములో స్టేట్ హైవేపై గవర్నమెంటు ప్రెస్ వద్ద మరియొక వంతెన కలదు. కాని దీనిపై నూజివీడు, అజిత్ సింగ్‌నగర్, పాయకాపురం, కండ్రిక, ప్రకాష్‌నగర్, బోస్ నగర్ వైపు నుండి విజయవాడ వైపు మరియు జాతీయ రహదారి వైపు వెళ్ళు వాహనముల వలన తరచు ట్రాఫిక్ అంతరాయము కలుగుచున్నది. కావున పైన తెలిపిన ఇబ్బందులను దృష్టిలో వుంచికొని ఈ బ్రిడ్జి నిర్మాణము ఎంతైనా అవసరము.

బ్రిడ్జి నిర్మాణము కొరకు మోర్త స్పెసిఫికేషన్ ప్రకారము మరియు 2008-09 S.S.R. రేట్ల ప్రకారము అంచనాలను తయారుచేయగా పనియొక్క అంచనా విలువ రూ.5.10 కోట్లు.

2008-09 సంవత్సర బడ్జెటు నందు నగరములో బ్రిడ్జిలు మరియు సబ్-వేల నిర్మాణము కొర్కై రూ.10.00 కోట్లు కేటాయించినారు. కావున ఈ బ్రిడ్జి నిర్మాణమునకు రూ.5.10 కోట్ల అంచనాలతో చేపట్టుటకు పరిపాలనా ఆమోదము కొరకు కౌన్సిలు వారి అనుమతి కోరడమైనది (Rc.E.E.-VI-125847/2008) .

**98/171**- శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానములో ది.**03-01-2008**న ప్రమాదం జరిగిన తరువాత ఇంద్రకీలాద్రి కొండ ప్రాంతమున అభివృద్ధి పనులు దేవస్థానం వారు చేపట్టుట జరిగినది. ఈ అభివృద్ధి పనులలో భాగంగా ప్రస్తుతము ఉన్న ఘాటు రోడ్డు వెడల్పుచేయు పని చేపట్టబడినది.

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం వారు అరండల్ సత్రము వద్దనున్న **50,000** గ్యాలన్ల సామర్థ్యము గల హై లెవల్ రిజర్వాయర్‌ను ఘాట్ రోడ్డు వెడల్పుచేయు నిమిత్తం తొలగించవలసినదిగా కోరి ఉన్నారు. ఈ రిజర్వాయరు ది.**11-04-1929** తేదీన జాతిపిత మహాత్మా గాంధీ గారిచే ప్రారంభించబడినది. ప్రస్తుతం ఈ రిజర్వాయరు నుండి అర్జున వీధి బూస్టరు ద్వారా కొండ ప్రాంతమునకు త్రాగునీరు సరఫరా చేయబడుచున్నది. దేవస్థానం వారు చుట్టు ప్రక్కల ఉన్న ఇళ్లను తొలగించిన తరువాత ఈ రిజర్వాయరు యొక్క ఉపయోగము తగ్గినది మరియు ప్రస్తుతము ఈ రిజర్వాయరు ద్వారా నీటి సరఫరా చేయుచున్న ప్రాంతములకు ప్రత్యామ్నాయ మార్గము ద్వారా నీటి సరఫరా చేయవచ్చును. కావున ఈ రిజర్వాయరును తొలగించి మరియు ఇదే సామర్థ్యము గల నూతన రిజర్వాయరు వాటర్ వర్క్సు నందు నిర్మించుటకు అగు ఖర్చు మరియు స్థలము ఖరీదుతో కలిపి సుమారుగా రూ.**147.00** లక్షలు అగును. కాన పై విషయముపై తగు నిర్ణయము కొరకు కౌన్సిల్ ముందు ఉంచడమైనది. **(ఆర్.సి.ఇ6-125780/08).**

**99/172**- ది.**07-06-2008**వ తేదీన కమీషనర్, దేవాదాయ శాఖ, జాయింట్ కలెక్టర్ కృష్ణా జిల్లా మరియు కమీషనర్, విజయవాడ మునిసిపల్ కార్పోరేషన్ వారి ఆధ్వర్యములో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగు చున్న అభివృద్ధి పనులు జాయింట్ పర్యవేక్షణలో అర్జున్ వీధి వెడల్పుచేసి అభివృద్ధి చేయుటకు నిర్ణయించి, అర్జున్ వీధి కనకదుర్గ దేవస్థానము వారికి అప్పగించుటకు నిర్ణయించినారు.

సదరు ప్రతిపాదనను కౌన్సిల్ వారి ముందు ఉంచుటకు ఎగ్జిక్యూటివ్ అథారిటీ వారు ఆదేశించి యున్నారు. అందుపై సదరు విషయములను పరిశీలించడమైనది.

అర్జున్ వీధి, కెనాల్ రోడ్డు నుండి గోశాల వరకు ప్రస్తుతము సుమారు **30** అడుగుల వెడల్పుతో **330** మీటర్ల పొడవుతో వుంది. సర్వే రికార్డు ప్రకారము రోడ్డు భాగముగా నమోదై మునిసిపల్ రోడ్డుగా పరిగణించబడుతోంది. భవిష్యత్తులో కనకదుర్గా ఆలయము యొక్క ముఖ ద్వారము మరియు రాజగోపురము అర్జున్ వీధి వైపు మార్చుచున్నందున, ఈ వీధిలో యాత్రికుల (సందర్శనకు) రద్దీ విపరీతముగా పెరిగే అవకాశము యున్నది. ప్రస్తుతము ఉన్న **30** అడుగుల అర్జున వీధిని పడమర వైపున గల ఆర్కియాలజీ (పురావస్తు శాఖ) గోశాల, మరియు కనకదుర్గ దేవస్థానము వారి స్థలములో నుండి **30** అడుగులుగా తీసుకొని **60** అడుగుల వెడల్పు చేయుటకు దేవస్థానము వారు చర్యలు తీసుకొనుచున్నారు.

సదరు రోడ్డు వెడల్పుచేయు సందర్భములో ప్రస్తుతము ఉన్న రోడ్డును అభివృద్ధిపర్చవలసియున్నందున మరియు సదరు రోడ్డును దేవస్థానమునకు వచ్చు భక్తులు/యాత్రికులకు ఎక్కువగా ఉపయోగము ఉన్నందున సదరు రోడ్డును దేవస్థానము వారి ఆధీనములో ఉంచి అభివృద్ధిపరచుటకు దేవస్థానము వారు అంగీకరించి యున్నారు. మరియు నగరపాలక సంస్థ వారు సదరు రోడ్డులో చేపట్టు భవిష్యత్తు అభివృద్ధి పనులకు ఆటంకము లేకుండా అన్ని హక్కులు కలిగియుండు షరతుతో **30** అడుగుల వెడల్పు (**9** మీటర్లు) మరియు **1080** అడుగుల పొడవు (**330** మీటర్లు)తో అర్జున్ వీధిని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము వారికి అప్పగించే విషయమై కౌన్సిల్ వారి ఆమోదము కోరుతూ వ్రాసిన ఆఫీసు సూచన చదవడమైనది. **(ఆర్.సి.జి1-21929/08).**

100/173- శ్రీ ఎ.రమణారావు, (అర్జున మరియు ద్రోణాచార్య అవార్డు గ్రహీత), ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ అసోసియేషన్, విజయవాడ వారు ది. 23.7.07 గల వారి లేఖలో వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవాడ నందు నైపుణ్యము కలిగిన యువ క్రీడాకారులను తయారు చేయుటకుగాను శిక్షణా శిబిరమును నెలకొల్పుటకు అంగీకారము తెలిపినారనియూ, అందుకుగాను చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం, పటమట వద్ద గల ఖాళీ స్థలమును కేటాయించవలసినదిగానూ, అందుకు సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టును త్వరలో సమర్పించగలవారమని తెలిపియున్నారు.

సదరు విషయమును కౌన్సిల్ వారి ముందు వుంచగా కౌన్సిల్ వారు తమ తీర్మానము నెం.198, ది. 6.8.2007 నందు పూర్తి వివరములతో కౌన్సిల్ వారిముందు వుంచవలెనని తీర్మానించియున్నారనియూ.

అందుపై శ్రీ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంనకు దక్షిణము వైపు సుమారు 4,000 చ.గ.లు ఖాళీ స్థలము కలదనియూ, సదరు స్థలమును వాలీబాల్ ఫెడరేషన్ వారికి కేటాయించినచో నగరములో గల మరీ ముఖ్యముగా సదరు చుట్టు ప్రక్కల గల ఔత్సాహిక యువ క్రీడాకారులకు మంచి శిక్షణ పొందుటకు అవకాశము వుండి క్రీడాభివృద్ధికి దోహదపడును.

కావున సదరు చర్చనీయ స్థలము వాలీబాల్ ఫెడరేషన్, విజయవాడ వారికి తాత్కాలిక శిక్షణా శిబిరము నెలకొల్పుటకుగాను తాత్కాలికముగా కేటాయించు విషయములో తగు నిర్ణయము కొర్రకై కౌన్సిల్ వారి ముందుంచిన ఆఫీసు నోటు చదవడమైనది.
(ఆర్.సి.జి2-40416/07).

**101/174-** విజయవాడ సత్యన్నారాయణపురం తాడంకి వారి వీధిలో వున్న శ్రీ తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రి నగరపాలక సంస్థ ప్రాథమికోన్నత పాఠశాల శిథిలావస్థలో వున్నది.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-2 గారు తమ లేఖ నెం.ఆర్.సి.ఇ**11-519/05**, తేది: **27-05-08** ద్వారా సదరు స్కూలు శిథిలావస్థలో వున్నదనియూ, నివాసయోగ్యము కాదనియూ తెలియచేసియున్నారు. డి.ఇ.ఓ. కృష్ణా గారు తమ లేఖ నెం.**1**/స్పెషల్/బి**1/08**, తేది: **11-06-08** ద్వారా సదరు స్కూలును ఎ.కె.టి.పి. ఎం.సి., హై స్కూలులో విలీనం చేయుటకు అనుమతి ఇచ్చియున్నారు.

సదరు స్కూలులో ప్రస్తుతము **40** మంది విద్యార్థులు మాత్రమే చదువుకొంటున్నారు. కావున, సదరు స్కూలును తాత్కాలికముగా మూసివేస్తూ అందులోని విద్యార్థులను సమీపములోని ఎ.కె.టి.పి. ఎం.సి. హై స్కూలులో వారి తరగతులను పెట్టి అనుమతించుటకు ఏర్పాట్లు చేయడమైనది.

సదరు స్కూలు నివాసయోగ్యమునకు ఉపయోగపడదు. కావున, దానిని పడగొట్టుటకు మరియు సదరు స్కూలును మరొక ప్రాంతములో ఏర్పాటు చేయుటకు మరియు సదరు స్కూలులో చదువుకుంటున్న విద్యార్థులను సమీప స్కూలులో విలీనము చేయుటకున్నూ ఆఫీసు వారిచే ప్రతిపాదించబడిన సూచనపై తగు నిర్ణయము తీసుకొనవలసినదిగా కార్పోరేషన్ వారిని కోరుచున్న ఆఫీసు వారి సూచనను చదవడమైనది.
**(ఆర్.సి.కె2-120658/08).**

102/175- విజయవాడ నగరములో కృష్ణానది మరియు బుడమేరు వరద బాదితుల పునరావసము కొర్రకై జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునరుద్ధరణ పథకము (JNNURM) క్రింద భారత ప్రభుత్వము వారు 15000 గృహములు మౌలిక సదుపాయములతో కలిపి రూ. 258.74 కోట్లకు మంజూరు చేసియున్నారు. ఈ పథకములో నిర్మించు నివాస గృహమునకు రూ. 1.32 లక్షలు అంచనా మొత్తముగా శాంక్షన్ అయినవి.

ఆదే విధముగా విజయవాడ నగరమునకు JNNURM - BSUP పథకము నందు అభ్యంతరకరమైన ఆక్రమిత ప్రదేశములలో నివసించువారి పునరావాసము కొర్రకై భారత ప్రభుత్వము వారు అదనముగా 6752 గృహములను రూ.190.88 కోట్లకు మౌలిక సదుపాయములతో కలిపి మంజూరు చేసియున్నారు. ఈ పథకము క్రింద ప్రతి నివాస గృహమునకు రూ.1.40 లక్షలు అంచనా విలువగా మంజూరు చేసియున్నారు. .

ఈ మంజూరైన మొత్తములో Govt. of India వారు 50%, రాష్ట్ర ప్రభుత్వము వారు 20%, బ్యాంకు లోను 20% మరియు లబ్దిదారులు 10% గాను భరించవలసియున్నది.

కాని ప్రభుత్వము వారి నిబంధనల ప్రకారము G+3 పద్ధతిలో గృహములను నిర్మించుటకు 2007-08 స్టాండర్డ్ షెడ్యుల్ రేట్లతో అంచనాలను తయారు చేయడమైనది. ఈ అంచనాల ప్రకారము ఒక గృహము యొక్క నిర్మాణపు అంచనా వ్యయము 1.70 లక్షలు

అయినది. అంచనా విలువ రూ.1.70 లక్షలతో టెండర్లను పిలిచి, కాంట్రాక్టర్లకు 6784 గృహముల నిర్మాణ పనులను అప్పగించడమైనది. ఈ పెరిగిన మొత్తమునకు శాంక్షన్ కొరకు ప్రభుత్వము వారికి లేఖ వ్రాయడం జరిగినది.

పనులు జరుగుచున్న ప్రదేశముల వివరములు ఈ క్రింది విధముగా ఉన్నవి.

| Sl. No. | Location | No. of Blocks | No.of Units / Beneficiaries |
|---|---|---|---|
| 1 | Vambay Colony (Package C1) | 21 | 672 |
| 2 | Vambay Colony (Package C2) | 21 | 672 |
| 3 | New R.R.pet (Package 1) | 19 | 608 |
| 4 | New R.R.pet (Package 2) | 18 | 576 |
| 5 | New R.R.pet (Package 3) | 17 | 544 |
| 6 | Machavaram (Sector A – Vambay Colony) | 14 | 448 |
| 7 | Payakapuram,Sundaraiah nagar, Radhanagar | 11 | 352 |
| 8 | Kundavari Kandrika | 7 | 224 |
| 9 | Vambay Colony (Package - H3) | 12 | 384 |
| 10 | Jakkampudi (Package - 1) | 18 | 576 |
| 11 | Jakkampudi (Package - 2) | 18 | 576 |
| 12 | Vambay Colony (Package - H1) | 16 | 512 |
| 13 | Vambay Colony (Package - H2) | 20 | 640 |
| | Total | 212 | 6784 |

మొదటి విడత శాంక్షన్ అయిన 15 వేల గృహములలో హౌసింగ్ కార్పోరేషన్ వారు నిర్మించుచున్న 1152 గృహముల నిర్మాణముతో కలిపి మొత్తము 6784 గృహముల నిర్మాణము వివిధ దశలలో ఉన్నవి. మిగిలిన 8216 నివాస గృహముల నిర్మాణము కొరకు అనేకసార్లు టెండర్లు పిలువగా నేటి వరకు ఎవరు టెండర్లు దాఖలు పరచలేదు. పైన తెలిపిన 8216 నివాస గృహముల నిర్మాణము కొరకు తిరిగి 2008-09 SSR రేట్లతో అంచనాలను తయారు చేయవలసిఉన్నది.

రెండవ విడత శాంక్షన్ అయిన 6752 గృహములకు కూడా కొత్త 2008-09 SSR రేట్లను ఉపయోగించి అంచనాలను తయారు చేయుట జరుగుచున్నది.

పై విషయములు తగు సమాచారం నిమిత్తము కౌన్సిల్ ముందు ఉంచడమైనది.

(Rc.CE / 10196 / JNNURM / HOUSING / 2006)

**103/176**-విజయవాడ నగరపాలక సంస్థచే నిర్వహించబడుచున్న క్రింద పేర్కొనబడిన ఎలిమెంటరీ మరియు యు.పి.స్కూలు కాంప్లెక్స్‌లలో గల యు.పి. స్కూలులను: అనగా

**1)** కేర్ అండ్ షేర్ యు.పి. స్కూలు, రాజరాజేశ్వరిపేట.

**2)** వి.ఎం.ఆర్.ఆర్. యు.పి. స్కూలు, కృష్ణలంక.

**3)** ఆర్.జి.ఎం.సి. యు.పి. స్కూలు, రాజీవ్ నగర్.

**4)** వి.యం.సి. ఉర్దూ యు.పి. స్కూలు, అరండల్‌పేట.

**5)** ఎస్.ఎం.ఏ. ఖుద్దూస్ (ఉర్దూ) యు.పి. స్కూలు, కేదారేశ్వరపేట

లను హైస్కూలుగా అప్-గ్రేడ్ చేయడమైనది. అందులోని వి.ఎం.ఆర్.ఆర్. హైస్కూలును బాలికల కొరకు కేటాయించడమైనది.

సదరు ఐదు స్కూలులలో: కేర్ అండ్ షేర్ కాంప్లెక్స్‌లో క్లాస్ రూముల కొరత వున్నందున సదరు కాంప్లెక్స్‌లో గల ఎలిమెంటరీ మరియు హైస్కూలులను షిఫ్ట్ పద్ధతిపై నిర్వహించుటకు నిర్ణయించడమైనది.

అందువలన ఎలిమెంటరీ విభాగమును ఉ. **7.45** గంటల నుండి మ.**12.30** గంటల వరకున్నూ, హై స్కూలును మ.**12.30** గంటల నుండి సా. **5.30** గంటల వరకు నిర్వహించుటకు నిర్ణయించడమైనది.

మిగిలిన నాలుగు హై స్కూలులను వాటి కాంప్లెక్స్‌లలో వున్న ఎలిమెంటరీ విభాగముతో కలిపి ఉ.**9.45** గంటల నుండి సా. **4.40** గంటల వరకు నిర్వహించుటకు నిర్ణయించడమైనది.

కావున అప్-గ్రేడ్ చేయబడిన పైన పేర్కొనబడిన ఐదు హై స్కూలులు మరియు ఎలిమెంటరీ విభాగముల పని వేళలను నిర్ణయిస్తూ ఆఫీసు వారు తీసుకొన్న చర్యలను ర్యాటిఫై చేయవలసినదిగా కార్పోరేషన్ వారిని కోరుచున్న ఆఫీసు వారి సూచనను చదవడమైనది. **(ఆర్.సి.కె3-10638/06).**

<u>విజయవాడ నగరపాలక సంస్థకు అనువర్తించబడిన **1955** హైదరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ చట్టములోని సెక్షన్-**88(జె)** ననుసరించి సప్లిమెంటరీ ఎజెండాలోని అదనపు అంశములు</u>

...

<u>శ్రీ బుద్దా జగన్నాధం, **25**వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు</u> **:-**

**104/177-** **25**వ డివిజన్ దాదాపు **75%** కొండ ప్రాంతము నందు కలదు. కొండ ప్రాంతము నందు అవసరమైన చోట్ల ఎస్.వి.ల్యాంపు ఏర్పాటు చేయమని గతంలో కూడా ప్రతిపాదించగా ఇంత వరకు అమలు కాలేదు. ప్రధాన రోడ్లలో ఎస్.వి. ల్యాంప్స్ ఒకే రోడ్డులో **25** నుండి **30** వేసిన విధంగా, కొండ ప్రాంతము అయిన **25**వ డివిజన్ ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా అవసరమైన చోట్ల ఎస్.వి.ల్యాంప్స్ తక్షణమే ఏర్పాటు చేయగలరని ప్రతిపాదించుచున్నాను.

**105/178-** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ''రాజగోపురం'' నిర్మాణము నిమిత్తం సుమారు **90** ఇళ్ళు తొలగించారు. తొలగించిన **90** ఇళ్ళ నందు నివాసము ఉన్న అర్హులైన వారందరికీ ''ఇందిరమ్మ గృహములు'' మొదటి దశలో ఏర్పాటు చేయగలరని ప్రతిపాదించుచున్నాను.

<u>శ్రీ బోయి సత్యబాబు, **37**వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన</u> **:-**

**106/179-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జి.ఓ.యం.యస్. నెం.**166**, తేది: **16-02-2008** వలన విజయవాడ నగరంలోని పేద, మధ్య తరగతి ప్రజలపై భారంగా ఉన్నందున, ప్రభుత్వం వెంటనే భారాలు లేని విధంగా తగు మార్పులు చేయవలసినదిగా కోరుతూ ప్రతిపాదించడమైనది.

<u>శ్రీమతి కాజా సరోజ, **19**వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన</u> **:-**

**107/180-** **19**వ డివిజన్ నిమ్మతోట సెంటర్ ఇజ్జాడ అప్పలనాయుడు వీధి కొండ ప్రాంతంలో ఉన్న క్రాస్ రోడ్లకు ఇరు వైపులా ఉన్న సైడు డ్రైన్లు, రిటైనింగ్ వాల్స్ చెడిపోయి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు. కావున వెంటనే సైడ్ డ్రైన్లు, రిటైనింగ్ వాల్స్ రిపేర్లు చేయవలసినదిగా ప్రతిపాదించడమైనది.

<u>శ్రీ చిగురుపాటి బాబూరావు, **55**వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన</u> **:-**

**108/181-** విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన రీడింగ్ రూములందు కేర్-టేకర్ల స్థానంలో నగరపాలక సంస్థ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లకు అప్పగించే చర్యలు ఉపసంహరించి, పాఠకులకు ఉపయోగపడు విధంగా కేర్-టేకర్లను పాత పద్ధతిలో కొనసాగించునట్లు తగు చర్యలు చేపట్టాలని ప్రతిపాదించడమైనది.

శ్రీ చెరుకూరి కృష్ణకుమార్, ఎక్స్-డిప్యూటీ మేయరు మరియు 5వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

**109/182**-నగరములో ప్రతి సం.ము అన్ని వీధులలో ఖాళీ ప్రదేశములలో నీడనిచ్చు మొక్కలను పెంచుట జరుగుచున్నది. (పచ్చదనము-పర్యావరణ పరిరక్షణకు) ఈ మొక్కల ప్రొటెక్షన్ కొరకు ఐరన్ ట్రీ గార్డ్సుకు రూ.450/-లు ఖర్చు పెట్టుట జరుగుచున్నది. కానీ వీటిని దొంగిలించి పాత ఇనుముకు రూ.50/-లు, రూ.60/-లకు అమ్ముకొనుచున్నారు. దీనికన్నా విజయవాడలో మేదర కులస్థులు గతంలోలాగా పనిలేక పేదరికంలో మ్రగ్గుచున్నారు. కావున, ట్రీ గార్డ్సును రూ.60/-లకు వారు తయారుచేసి యివ్వగలరు (వెదురుతో) వారికి జీవనోపాధి కల్పించినట్లుండును. 1 సం.ము ప్రొటెక్షన్ కల్పించిన ఆ మొక్కలు పెద్దవవ్వగలవు. కావున, వెదురుతో చేసిన ట్రీ గార్డ్సు చేయించి, వారి కుటుంబాలను ఆదుకోవాలని ఆడవారు, మగ వారితో గ్రూపులు పెట్టించి ప్రోత్సహించాలని ప్రతిపాదించుచున్నాను.

శ్రీ ఉమ్మడిశెట్టి బహదూర్, 14వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-

**110/183**- 14వ డివిజన్‌లో వృద్ధాప్య మరియు వితంతు చేనేత పెన్షనుదారులు సుమారు 1000 మంది ఉన్నందున ప్రతి నెలలో వీరికి ఇచ్చే పెన్షన్లు రెండు రోజులు మాత్రమే ఇచ్చుచున్నందున వృద్ధులు, వికలాంగులు ఉదయం వచ్చిన వారు సాయంత్రం వరకు నిలబడలేక కళ్ళు తిరిగి సొమ్మసిల్లిన పరిస్థితులు అనేకం (వీరిలో 90% వృద్ధులు బి.పి., షుగరు మరియు ఆస్తమా వ్యాధి వున్న వారు). ఇంకా వికలాంగుల పరిస్థితి వేరే చెప్పనక్కరలేదు మరియు వితంతువులు అందరూ భర్తలను పోగొట్టుకొని వారి కుటుంబ జీవనం కొరకు కూలి నాలి చేసుకొని జీవించేటటువంటి వాళ్ళు. వితంతువులు నెలలో పెన్షన్‌ల కొరకు ఒక రోజు పనిని పోగొట్టుకొనుట వలన అక్కడ వారు పనిచేసే యజమానితో వివాట్లు మరియు పనిలోంచి తీసివేయుట జరుగుచున్నది. కనుక పై పరిస్థితులను పరిశీలించి ప్రతి నెలా పెన్షన్లు 1 నుంచి 5వ తారీఖు వరకు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఇచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవలసినదిగా ప్రతిపాదించడమైనది.

**111/184**-విజయవాడ నగరంలో స్వయం సహాయక సంఘాల వారికి ఆరు మాసములు దాటిన ప్రతి సంఘానికి బ్యాంకుల వారు ఋణాలు మంజూరు చేయవలెనన్న, నిబంధనలు ఉన్నప్పటికీ ఆ ప్రకారం బ్యాంకుల వారు నెలలు గడుస్తున్నప్పటికీ ఋణాలు మంజూరు చేయక మహిళలను నెలల తరబడి వారు బ్యాంకుల చుట్టూ త్రిప్పుకొనుచూ కాల యాపన చేస్తున్నందున, స్వయం సహాయక సంఘాల ఋణాల విషయములో ఏ ఏ బ్యాంకులు ఋణాలు మంజూరు చేయుటకు సహకరించుట లేదో తగు విషయములను తెలుసుకొనుటకు ప్రతి నెలలో ఒక రోజు ప్రత్యేకించి అధికారులు మరియు ప్రజా ప్రతినిదులతో కూడిన సమావేశాన్ని ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీ కాశీనాథ్ దోనేపూడి, 23వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

**112/185**- 23వ డివిజన్ పరిధిలోవున్న పాత గుడ్డల బజారులో వున్న రెండు కరెంటు పోల్స్ పడిపోయేందుకు సిద్ధంగా వున్నవి. వాటి స్థానే కొత్త పోల్స్ వేయించేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రతిపాదించడమైనది.

శ్రీమతి మల్లిక బేగం, మేయరు మరియు 40వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

**113/186**-ఉత్తర భారతదేశంలోని వివిధ కార్పోరేషన్‌ల యందు JNNURM పథకం పనితీరును పరిశీలించుటకు విజయవాడ నగర కార్పోరేటర్స్ బృందం వెల్లిన సందర్భముగా దీని తాలుకు వివరాలు వివరించుటకు ప్రతిపాదన.

ది.20-06-2008 శుక్రవారము ఉదయము గం.10.30 ని॥లకు జరిగిన
విజయవాడ నగరపాలక సంస్థ సాధారణ సర్వ సభ్య సమావేశపు ప్రొసీడింగ్స్

సభ్యుల హాజరు

1. శ్రీమతి అన్నే ప్రసన్న,
డిప్యూటీ మేయరు.
2. శ్రీ ముసునూరి సుబ్బారావు
3. శ్రీ కలపాల అంబేద్కర్
4. శ్రీ చెరుకూరి కృష్ణ కుమార్
5. శ్రీ ఇజ్జాడ అప్పలనాయుడు
6. శ్రీమతి తాడి శకుంతల
7. శ్రీమతి నల్లూరు ఉషారాణి
8. శ్రీమతి కోనేరు రమాదేవి
9. శ్రీ రామాయణపు శ్రీనివాస రావు
10. శ్రీ నడకుదిటి సుబ్బరాజు
11. శ్రీమతి కోగంటి విమలకుమారి
12. శ్రీ బొడ్డు అప్పలనాయుడు
13. శ్రీ దాసరి దాస్ ప్రకాష్
14. శ్రీ మాగంటి వెంకట నరసింహారావు
15. శ్రీ సిరిపురపు ఫిలిప్స్ గ్రిటన్
16. శ్రీమతి కాజా సరోజ
17. శ్రీమతి ఆఫ్రీన్ సుల్తానా
18. శ్రీమతి ముత్తంశెట్టి వెంకట రత్న బిందు
19. శ్రీ అడపా శేషగిరి
20. శ్రీ కాశీనాధ్ దోనేపూడి
21. శ్రీ కోరాడ రామ్మోహన రావు
22. శ్రీ బుద్దా జగన్నాధం
23. శ్రీ యలకల చలపతి రావు
24. శ్రీ ఖాదర్
25. శ్రీ పత్తి నాగేశ్వర రావు
26. శ్రీ గుమ్మడిదల కోటేశ్వర రావు
27. శ్రీ తాజ్‌నోత్ దాసు
28. శ్రీ ధూళిపూడి వెంకట రమణ బాబు
29. శ్రీమతి కోళ్ళ సుధారాణి
30. శ్రీ షేక్ కరీముల్లా
31. శ్రీమతి సుఖమంచి శైలజ
32. శ్రీమతి చిలకా సలోమి
33. శ్రీమతి చెన్నూరి సుభాషిణి
34. శ్రీ బోయి సత్యబాబు
35. శ్రీ మహదేవు అప్పాజీరావు
36. శ్రీ నూకల నాగేశ్వర రావు
37. శ్రీమతి దుట్టా వెంకట మహాలక్ష్మి
38. శ్రీ కునుకు రాజశేఖర్
39. శ్రీమతి వీరమాచినేని లలిత
40. శ్రీ పూనూరు గౌతమ్ రెడ్డి
41. శ్రీమతి పిల్లి లక్ష్మి తులసి
42. శ్రీ సామంతపూడి నరసరాజు
43. శ్రీమతి తాడికొండ దుర్గా వెంకట నాగలక్ష్మి
44. శ్రీ మీసాల రాజేశ్వర రావు
45. శ్రీ దోనేపూడి శంకర్
46. శ్రీ శిష్ట్లా రామలింగ మూర్తి
47. శ్రీ ఎరుబోతు రమణారావు
48. శ్రీమతి పెన్మెత్స దుర్గా భవాని
49. శ్రీ గోగుల రమణారావు
50. శ్రీ చిగురుపాటి బాబూరావు
51. శ్రీ బి.హెచ్.యస్.వి.జానారెడ్డి
52. శ్రీమతి వీర్ల వరలక్ష్మి
53. శ్రీమతి మురిపాల సత్యవతి
54. శ్రీమతి కొప్పురపు శ్రీదేవి

ఎక్స్-అఫిషియో సభ్యులు:-

1. శ్రీ షేక్ నాసర్ వలి, ఎం.ఎల్.ఏ.,
పశ్చిమ నియోజక వర్గ శాసన సభ్యులు.

కో-ఆప్టెడ్ సభ్యులు:-

1. శ్రీ కోరాడ విజయకుమార్
2. శ్రీమతి చలపాటి లలితాదేవి
3. శ్రీమతి కడియం చారమ్మ
4. శ్రీ మునీర్ అహ్మద్

సభకు డిప్యూటీ మేయరు శ్రీమతి అన్నే ప్రసన్న గారు అధ్యక్షత వహించినారు

సంతాప తీర్మానము :-

CPI జాతీయ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యులు, విజయవాడ నగర సమితి, కృష్ణా జిల్లా సమితి కార్యదర్శిగా పనిచేసిన శ్రీ దాసరి నాగభూషణ రావు గారు ది.27-04-2008న స్వర్గస్తులైనారు. వారి మృతిపట్ల ఈ కౌన్సిల్ వారు తీవ్ర దిగ్భ్రాంతి చెందుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ తీర్మానించడమైనది.

**1/74** – ధృవపరచడమైనది.

**2/75** – ప్రశ్నలు – జవాబులు

**3/76** – ఆఫీసు సూచన ఆమోదించడమైనది.

**4/77** – కోర్టు తీర్పు సమాచారముతో సమావేశమునందుంచవలసినదిగా తీర్మానించడమైనది.

**5/78** – ఆఫీసు సూచనలో పేర్కొన్న **4** దరఖాస్తులను ఆమోదిస్తూ, ఖాళీగా వున్న టీచరు పోస్టుల వివరములు సక్రమముగా లేనందున, ఆఫీసు వారు పరిశీలించి సవరించిన జాబితాను కౌన్సిల్ వారి ముందుంచ వలసినదిగా తీర్మానించడమైనది.

**6**వ అంశముగా ఈ క్రింది ప్రతిపాదనలను చర్చించడమైనది.

**43/116** మరియు **49/122** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**6/79** – రికార్డు చేయడమైనది.

**7/80** – ఆఫీసు సూచన ఆమోదించడమైనది.
**8/81** – ఆఫీసు సూచన ఆమోదించడమైనది.
**9/82** – ఆఫీసు సూచన ఆమోదించడమైనది.

**10/83**– పాత బస్‌స్టాండ్ ప్రదేశము ట్రాఫిక్ రద్దీ ప్రాంతము, సదరు ప్రాంతములో ఏ విధమైన భారీ కట్టడముల నిర్మాణములకు అనుకూలము కాదుగనుక అంబికా ఎంపైర్ వారి దరఖాస్తును తిరస్కరిస్తూ, సదరు ప్రాంతమును ప్రజోపయోగమునకు ఉపయోగించవలసినదిగా A.P.S.R.T.C. వారిని కోరుతూ తీర్మానించడమైనది.

**11/84**– సంబంధిత డిపార్టుమెంట్స్ నుండి పర్మిషన్స్ వచ్చిన పిదప కౌన్సిల్ ముందుంచవలసినదిగా తీర్మానించడమైనది.

**12/85**– స్వచ్ఛంధ సంస్థల వారి ద్వారా గానీ జిల్లా స్పోర్ట్సు అథారిటీ వారి ద్వారా గానీ ఏ విధమైన రుసుము వసూలు చేయకుండా నిర్వహించుటకు నిర్ణయిస్తూ తీర్మానించడమైనది.

**13/86**– రికార్డు చేయడమైనది.
**14/87**– రికార్డు చేయడమైనది.

**15/88, 66/139** మరియు **85/158** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**16/89 & 76/149** – అర్హత కల్గిన వారందరికీ రేషన్ కార్డులు ఇచ్చుటకు తగు చర్యలు తీసుకొనవలసినదిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించడమైనది.

**17/90** – ప్రతిపాదన ఆమోదిస్తూ, **3** మాసములలో రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేయవలసినదిగా తీర్మానించడమైనది.

**18/91** – ఎయిర్ టెక్ మెషిన్‌లు కొనుగోలు చేయుటకు నిర్ణయిస్తూ తీర్మానించడమైనది.
&
**41/114** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**19/92** – ప్రతిపాదన ఆమోదించడమైనది.
&
**102/175** – రికార్డు చేయడమైనది.

మెజారిటీ సభ్యుల ఆమోదముతో సభను ది.**21-06-2008** శనివారము ఉదయం గం.**10.30**ని॥లకు వాయిదా వేసినట్లు సభాధ్యక్షుల వారు ప్రకటించినారు.

★★★

ది.**21-06-2008** ఉదయం గం.**10.30**ని॥లకు కొనసాగించిన సాధారణ సర్వ సభ్య సమావేశమునకు హాజరైన సభ్యులు

1. శ్రీమతి అన్నే ప్రసన్న, డిప్యూటీ మేయరు.
2. శ్రీ ముసునూరి సుబ్బారావు
3. శ్రీ కలపాల అంబేద్కర్
4. శ్రీ చెరుకూరి కృష్ణ కుమార్
5. శ్రీమతి తాడి శకుంతల
6. శ్రీమతి నల్లూరు ఉషారాణి
7. శ్రీమతి కోనేరు రమాదేవి
8. శ్రీ రామాయణపు శ్రీనివాస రావు
9. శ్రీ నడకుదిటి సుబ్బరాజు
10. శ్రీమతి కోగంటి విమలకుమారి
11. శ్రీ బొడ్డు అప్పలనాయుడు
12. శ్రీ సిరిపురపు ఫిలిప్స్ గ్రిటన్
13. శ్రీమతి కాజా సరోజ
14. శ్రీమతి ఆఫ్రీన్ సుల్తానా
15. శ్రీమతి ముత్తంశెట్టి వెంకట రత్న బిందు
16. శ్రీ అడపా శేషగిరి
17. శ్రీ కాశీనాథ్ దోనేపూడి
18. శ్రీ కోరాడ రామ్మోహన రావు
19. శ్రీ బుద్దా జగన్నాథం
20. శ్రీ ఖాదర్
21. శ్రీ పత్తి నాగేశ్వర రావు
22. శ్రీ తాజ్‌నోత్ దాసు
23. శ్రీమతి కోళ్ళ సుధారాణి
24. శ్రీ షేక్ కరీముల్లా
25. శ్రీమతి సుఖమంచి శైలజ
26. శ్రీమతి చిలకా సలోమి
27. శ్రీమతి చెన్నూరి సుభాషిణి
28. శ్రీ బోయి సత్యబాబు
29. శ్రీ మహదేవు అప్పాజీరావు
30. శ్రీ నూకల నాగేశ్వర రావు
31. శ్రీ కునుకు రాజశేఖర్
32. శ్రీమతి వీరమాచినేని లలిత
33. శ్రీ పూనూరు గౌతమ్ రెడ్డి
34. శ్రీమతి పిల్లి లక్ష్మి తులసి
35. శ్రీ సామంతపూడి నరసరాజు
36. శ్రీమతి తాడికొండ దుర్గా వెంకట నాగలక్ష్మి
37. శ్రీ శిష్ట్లా రామలింగ మూర్తి
38. శ్రీ ఎరుబోతు రమణారావు
39. శ్రీమతి పెన్మెత్స దుర్గా భవాని
40. శ్రీ గోగుల రమణారావు
41. శ్రీ చిగురుపాటి బాబూరావు
42. శ్రీమతి వీర్ల వరలక్ష్మి
43. శ్రీమతి మురిపాల సత్యవతి
44. శ్రీమతి కొప్పురపు శ్రీదేవి

<u>కో-ఆప్టెడ్ సభ్యులు</u>:-

1. శ్రీమతి కడియం చారమ్మ
2. శ్రీ మునీర్ అహ్మాద్

సభకు డిప్యూటీ మేయరు శ్రీమతి అన్నే ప్రసన్న గారు అధ్యక్షత వహించినారు

**20/93** – ప్రతిపాదన ఆమోదించడమైనది.
**21/94** – ప్రతిపాదన ఆమోదించడమైనది.
**22/95** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**23/96** – ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.

**24/97** – కమిటీ రిపోర్టులను తదుపరి సమావేశము నందు ప్రవేశపెట్టవలసినదిగా తీర్మానించడమైనది.

**25/98** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**26/99 & 31/104** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**27/100** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**28/101** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**29/102** – అవసరాన్నిబట్టి తగు చర్యలు తీసుకొనవలసినదిగా కమీషనర్ గార్ని కోరుతూ తీర్మానించడమైనది.

**30/103 మరియు 65/138** – ప్రస్తుతము వున్న వాహనమును పూర్తి కండీషన్‌లో వుంచుటకు, కొత్తగా మరొక వాహనము కొనుగోలు చేయుటకు నిర్ణయిస్తూ తీర్మానించడమైనది.

**32/105, 52/125 మరియు 74/147** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

పై అంశము నందు సి.పి.ఐ.(ఎం) సభ్యులు మరియు టి.డి.పి. సభ్యులు తమ నిరసనను తెలియజేస్తూ సభ నుండి వాకౌట్ చేసినారు. మరియు సి.పి.ఐ. సభ్యులు మాత్రము తమ నిరసనను తెలియజేసినారు.

**33/106** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**34/107** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**35/108** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**36/109** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**37/110** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**38/111** – అవసరమైన డివిజన్లను గుర్తించి, వయోజన విద్యా కేంద్రములను ఏర్పాటు చేయుటకు జిల్లా కలెక్టరు గారిని కోరుతూ తీర్మానించడమైనది.

**39/112** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**40/113** – ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.

**42/115** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**44/117 & 108/181** – నగరంలో ఉన్న అన్ని రీడింగ్ రూములు కొనసాగించవలసినదిగాను, కేర్-టేకర్‌లను నియమించవలసినదిగాను, రీడింగ్ రూములలో న్యూస్ పేపర్ల సంఖ్య పెంచవలసినదిగా తీర్మానించడమైనది.

**45/118** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**46/119** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**47/120** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**48/121** – ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.

**50/123** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**51/124** – పెంచిన గ్యాస్ ధర తగ్గించినందుకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు గౌ. డా॥ వై.యస్. రాజశేఖర్ రెడ్డి గారికి అభినందనలు తెలుపుతూ, డీజిల్, పెట్రోల్ ధరలను కూడ తగ్గించుటకు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లవలసినదిగా కోరుచూ తీర్మానించడమైనది.

**53/126, 59/132 మరియు 73/146** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

54/127 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
55/128 – ప్రతిపాదన ఆమోదించడమైనది.

56/129 – ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.

57/130 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
58/131 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
60/133 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
61/134 – ప్రతిపాదన ఆమోదించడమైనది.

62/135, 84/157 మరియు 109/182 } ప్రతిపాదన ఆమోదించడమైనది.

63/136 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
64/137 – ప్రతిపాదన ఆమోదించడమైనది.

67/140 – మేయరు గారి అధ్యక్షతన అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో ఒక కమిటీని నిర్ణయిస్తూ కమిటీ రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి పంపవలసినదిగా కోరుతూ తీర్మానించడమైనది.

శ్రీ పి.గౌతమ్ రెడ్డి, 44వ వార్డు మెంబర్ గారు వారి ప్రతిపాదిత అంశము నందు ఈ క్రింది సవరణలను ప్రవేశపెట్టినారు :

2వ అంశము నందు 'సర్వోన్నత గౌరవ వ్యక్తులుగా నిర్వహించబడాలి' బదులు ' సర్వోన్నత గౌరవ వ్యక్తులుగా నిర్వచించబడాలి ' అని వుండాలి. మరియు ఈ క్రింది అంశమును 21వ అంశముగా అదనముగా చేర్చవలసినదిగా కోరుచున్నాను.

'' 21) 74వ రాజ్యాంగ సవరణ చట్టంలోని 12వ షెడ్యూలులో ఉదహరించిన అదనపు విధులు, బాధ్యతలను నూతన చట్టంలో పొందుపరచి, వాటి సమర్థ నిర్వహణకు అవసరమైన అదనపు సిబ్బంది (యంత్రాంగం), అదనపు నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలి''.

మరియు చిట్ట చివరి నుండి రెండవ పేరాలో, రెంచవ లైను నుండి –

''మేయరు గారి ఆధ్వర్యములో వివిధ పక్షాల ఫ్లోర్ లీడర్లు, ఉప–ఫ్లోరు లీడర్లు, స్థాయీ సంఘ సభ్యులతో కూడిన ప్రతినిధి వర్గాన్ని పంపుటకు యీ కౌన్సిల్ నిర్ణయించాలని మేయరు గారు వెంటనే తగు చర్యలు తీసుకొనవలసినదిగా కోరటమైనది'' బదులుగా

''మేయరు గారి ఆధ్వర్యములో డిప్యూటీ మేయరు మరియు వివిధ పక్షాల ఫ్లోరు లీడర్లు, ఉప–ఫ్లోరు లీడర్లు, స్థాయీ సంఘ సభ్యులతో కూడిన ప్రతినిధి వర్గాన్ని పంపుటకు యీ కౌన్సిల్ తీర్మానిస్తుంది, ఈ నిర్ణయాన్ని అమలు చేయుటకు మేయరు గారు వెంటనే తగు చర్యలు తీసుకొనవలసినదిగా కోరటమైనది'' అని సవరించవలసినదిగా కోరుచున్నాను.

68/141 & 69/142 – జి.ఓ.ఎం.ఎస్. నెం.166 ద్వారా సత్వరమే పట్టాలను రిజిస్ట్రేషన్ చేయుటకు తగు చర్యలు తీసుకోవలసినదిగా తీర్మానించడమైనది.

70/143 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
71/144 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
72/145 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
75/148 – ప్రతిపాదన ఆమోదించడమైనది.

77/150 – ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.

78/151 – ట్రాఫిక్ అండ్ స్పోర్ట్సు కమిటీ వారికి రిఫర్ చేయడమైనది.

79/152 – ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.

80/153 – కమీషనర్ గార్ని తగు చర్యలు తీసుకోవలసినదిగా తీర్మా నించడమైనది.

81/154 – ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.

82/155 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
83/156 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
86/159 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
87/160 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
88/161 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
89/162 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
90/163 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
91/164 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
92/165 – ప్రతిపాదన ఆమోదించడమైనది.
93/166 – ప్రతిపాదన ఆమోదించడమైనది.

94/167 – ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.
95/168 – ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.

96/169 – ప్రతిపాదన ఆమోదించడమైనది.

97/170 – ఆఫీసు సూచన ఆమోదించడమైనది.

98/171 – వాయిదా వేయడమైనది.

99/172 – శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము నిధులతో అర్జున వీధిని అభివృద్ధిపరచుటకు ఆమోదించుచూ, సదరు వీధికి సంబంధించి సర్వ హక్కులు నగరపాలక సంస్థకు చెందే విధంగా చర్యలు చేపట్టవలసినదిగా నిర్ణయిస్తూ తీర్మానించడమైనది.

100/173 – వాలీబాల్ ఫెడరేషన్ వారు ప్రాజెక్టు రిపోర్టును సమర్పించకపోవుట వలన ఔత్సాహిక యువ క్రీడాకారులను ప్రోత్సహించుటకు తాత్కాలిక శిక్షణా శిబిరము 3 నెలలు కాలమునకు కేటాయించుచూ తీర్మానించడమైనది.

101/174 – ఆఫీసు సూచన ఆమోదించడమైనది.
103/176 – ఆఫీసు సూచన ఆమోదించడమైనది.

104/177 – ది.04-04-2008వ తేదీన గల 23/23 తీర్మానం ప్రకారం తగు చర్యలు తీసుకోవలసినదిగా తీర్మానించడమైనది.
(ప్రతి డివిజన్‌కు 5 ఎస్.వి. ల్యాంపులు ఏర్పాటు చేయవలసినదిగా తీర్మానించడమైనది)

105/178 – ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.

శ్రీ బుద్దా జగన్నాథం, 25వ వార్డు మెంబర్ గారు వారి ప్రతిపాదిత అంశమును ఈ క్రింది విధముగా సవరించినారు :

''శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ''రాజగోపురం'' నిర్మాణము నిమిత్తం 90 ఇళ్ళు తొలగించారు. తొలగించిన 90 ఇళ్ళ నందు నివాసము ఉన్న అర్హులైన అద్దెదారులందరికీ ''ఇందిరమ్మ గృహములు'' మొదటి దశలో ఏర్పాటు చేయగలరని ప్రతిపాదించుచున్నాను''.

**106/179** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**107/180** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**110/183** – పెన్షన్‌దారులకు ఏ విధమైన అసౌకర్యము కలుగకుండా తగు చర్యలు తీసుకొనవలసినదిగా తీర్మానించడమైనది.

**111/184** – ఋణాలు మంజూరుకు సత్వర చర్యలు చేపట్టవలసినదిగా తీర్మానించడమైనది.

**112/185** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**113/186** – రికార్డు చేయడమైనది.

సభాధ్యక్షుల వారైన గౌ॥ డిప్యూటీ మేయరు గారు రాత్రి గం.7.40 ని॥లకు సభ ముగిసినట్లు ప్రకటించినారు.

(సం.) వి. రవీంద్ర,
సెక్రటరీ ,
విజయవాడ నగరపాలక సంస్థ.

(సం.) అన్నే ప్రసన్న,
డిప్యూటీ మేయరు మరియు సభాధ్యక్షులు,
విజయవాడ నగరపాలక సంస్థ.

//నకలు//

సెక్రటరీ ,
విజయవాడ నగరపాలక సంస్థ.